ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 వరంగల్
శుక్రవారం 23 ఆగస్టు 2024



భద్రకాళి చెరువులో దట్టంగా పెరిగిన గుర్రపు డెక్క



కాలుష్య కోరల్లో చెరువులు

దుర్గంధం వెదజల్లుతున్న నగరంలోని జలాశయాలు

- విపరీతంగా పెరిగిన గుర్రపు డెక్క, నాచు
- కలుషితమవుతున్న చెరువుల నీరు..
- దెబ్బతింటున్న వాతావరణం
- దోమలు వృద్ధి చెంది రోగాల బారిన పడుతున్న ప్రజలు
- నిరుపయోగంగా ఫ్లోటింగ్ ట్రాష్ కలెక్టర్ మిషన్
- చెరువుల శుద్ధిపై బల్దియాకు లోపించిన చిత్తశుద్ధి

హనుమకొండ, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగరంలోని దాదాపు అన్ని చెరువుల్లో చెత్తాచెదారం పేరుపోయింది. నాచు (గ్రీన్ ఆల్గే) పెరిగి విపరీతమైన దుర్వాసన వెదజల్లుతోంది. చెరువుల నుంచి వస్తున్న దుర్వాసనతో అటువైపు వెళ్లాలంటేనే భయపడుతున్నారు. వేసవిలో చెరువుల్లో జరిగే రసాయనిక చర్య వలన దుర్వాసన పెరుగుతోంది. చెరువుల్లో కలిసే వ్యర్థాలు, అందులో పెరిగే గ్రీన్ ఆల్గే, గుర్రపుడెక్క వల్ల తీవ్రత ఉంటోంది. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు చెరువుల్లో విడుదలవుతున్న గ్యాస్ శాంపిళ్లను సేకరించి ల్యాబ్‌కు పంపించి పరీక్షించిన తర్వాత వరంగల్ నగరంలోని చెరువులన్నీ కాలుష్య కాసారాలుగా మారిపోయాయని, వీటిని ఇలాగే వదిలేస్తే ప్రజల ఆరోగ్యానికి ముప్పు వాటిల్లుతుందని హెచ్చరించింది.

దట్టంగా గుర్రపు డెక్క

చెరువుల్లో గుర్రపు డెక్క విపరీతంగా పెరిగిపోతోంది. వర్షాకాలంలో ఇది మరింత వేగంగా చెరువులను ఆక్రమిస్తోంది. గుర్రపుడెక్క చెరువులన్నిటినీ పూర్తిగా ఆక్రమించడంతో అవి పచ్చనిమైదానంలా కనిపిస్తున్నాయి. దూరం నుంచి చూస్తే అవన్నీ పచ్చిక బయళ్లేమోననే భ్రమను కల్పింపచేస్తున్నాయి. వీటిని ఎప్పటికప్పుడు తొలగించకపోతే చెరువులకు ముప్పువాటిల్లే ప్రమాదం ఉంది. గుర్రపు డెక్కను అంత సులభంగా తొలగించడం వీలుగు కాదు. వీటి వేళ్లు నీళ్లలో లోతుగా పాతుకుతాయి. చేతితో తొలగించడం కష్టం.

కూలీలతో తొలగించాలన్నా సాధ్యం కాదు. వేళ్లను మూలాల నుంచి తొలగిస్తే తప్పా దీనిని నిర్మూలించలేము. పైగా గుర్రపుడెక్కను తొలగించే క్రమంలో వాటితీగల్లో చిక్కుకుపోయి కూలీలు చెరువులో మునిగి మృతి చెందిన ఉదంతాలు ఉన్నాయి.

పర్యావరణ వేత్తల ఆందోళన

'మా చెరువులను కాపాడరూ' శీర్షికతో బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనాన్ని పురస్కరించుకొని వరంగల్‌లోని పర్యావరణవేత్తలు కొందరు నగరంలోని చెరువులను సందర్శించారు. వాటిలో గుర్రపుడెక్క విపరీతంగా పెరగడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. వ్యర్థ పదార్థాలను తొలగించడంలో వరంగల్ కార్పొరేషన్ అధికారులు తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శించడంపై ఆందోళన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో భద్రకాళి చెరువు వద్ద నిరుపయోగంగా పడి ఉన్న ఈ ఫ్లోటింగ్ మిషన్‌ను కూడా పరిశీలించారు. చెరువులను శుద్ధి చేయడానికి విలువైన ఈ యంత్రాన్ని ఉపయోగించాలని వారు కోరుతున్నారు.

దోమల బెడద

గుర్రపు డెక్క వల్ల దోమలు విపరీతంగా పెరుగుతాయి. నీళ్లు పూర్తిగా కలుషితమవుతాయి.



నిరుపయోగంగా ఉన్న ఫ్లోటింగ్ ట్రాష్ కలెక్టర్ మిషన్

పరిసరాలు అపరిశుభ్రంగా మారుతాయి. నీటి ప్రవాహానికి ఆటంకాలు ఏర్పడతాయి. వాతావరణం కలుషితమవుతుంది. దీంతో సమీప కాలనీల ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. ప్రధానంగా గుర్రపుడెక్క దట్టంగా పెరిగిన చెరువుల్లో చేపలు సరిగా పెరగవు. వాటికి ప్రాణవాయువు అందక మరణిస్తాయి. మత్స్యకారులు చెరువుల్లో గుర్రపు డెక్కలేకుండా చూడాలని వరంగల్ నగర పాలక సంస్థ అధికారులను తరుచూ విజ్ఞప్తులు చేస్తున్నారు. కాగా, భద్రకాళి చెరువులో సందర్శకుల కోసం బోటింగ్ సౌకర్యం ఏర్పాటు చేశారు. బోట్ నడవాలంటే చెరువులో ఎలాంటి ఆటంకాలు ఉండకూడదు. కానీ ఇందులో పెద్ద ఎత్తున గుర్రపుడెక్క, వ్యర్థ పదార్థాలు పేరుకుపోవడంతో ముందుగా దీనిని తొలగించాల్సిన అవసరం ఏర్పడింది.

ఎఫ్‌టీసీఎం మిషన్

వరంగల్ నగరంలోని చెరువుల్లో దట్టంగా పెరిగిన గుర్రపు డెక్కను, పేరుకుపోయిన ఇతర వ్యర్థాలను తొలగించేందుకు వరంగల్ నగర పాలక సంస్థ రూ.2 కోట్ల వ్యయంతో కొనుగోలు చేసిన ఫ్లోటింగ్ ట్రాష్ కలెక్టర్ మిషన్ (ఎఫ్‌టీసీఎం) ఏడాదిన్నరగా నిరుపయోగంగా పడి ఉన్నది. వాస్తవంగా మార్కెట్‌లో దీని రేటు రూ.1.20 కోట్ల నుంచి రూ.1.50 కోట్ల వరకు ఉంటుంది. కానీ వరంగల్ నగర పాలక సంస్థ మాత్రం దీనిని రూ.2కోట్లకు కొనుగోలు చేసింది. ఈ వ్యవహారంలో సుమారు రూ.50లక్షలు చేతులు మారినట్టు ఆరోపణలు ఉన్నాయి. యంత్రాన్ని కొన్న కొత్తలో భద్రకాళి చెరువులోని గుర్రపు డెక్కను కొంత మేరకు తొలగించేందుకు దీనిని ఉపయోగించారు. భద్రకాళి చెరువులో బోట్ తిరగడానికి వీలుగా గుర్రపు డెక్కను తొలగించారు. ఓ నాలుగైదు నెలలు పని చేసిన తర్వాత ఈ మిషన్ చెడిపోయింది. అప్పటి నుంచి ఇది మూలపడింది. చెరువులోనే కట్టపక్క నీళ్లలో తేలుతూ నిరుపయోగం పడింది. చాలా కాలంగా ఇది నీళ్లలో నానుతుండడంతో క్రమంగా తుప్పుపట్టి దెబ్బతింటోంది. చెరువుల్లో గుర్రపు డెక్కను, నాచును, ఇతర వ్యర్థపదార్థాలను తొలగించాల్సిన ఈ విలువైన యంత్రాన్ని ఇలా నిర్లక్ష్యంగా వదిలేయడం వల్ల ప్రజాధనం వృథా అయిపోతోంది. చెరువుల్లో కాలుష్యం అంతకంతకూ పెరిగిపోతోంది.

చెరువులు

వరంగల్, హనుమకొండ, కాజీపేట పట్టణాలతోపాటు దాని చుట్టు పక్కల విలీన గ్రామాల్లో చిన్నవి, పెద్దవి కలిపి సుమారు వందకుపైగా చెరువులు ఉన్నాయి. ఇందులో భద్రకాళి, వడ్డెపల్లి, చిన్నవడ్డెపల్లి చెరువులు, అలాగే మట్టెవాడ కోట చెరువు, గొర్రెకుంట కట్టమల్లన్న చెరువు, ఉర్సు రంగ సముద్రం చెరువు, తిమ్మాపురం బెస్తం చెరువు, రంగశాయిపేట దామెర చెరువు. తిమ్మాపురం చెస్తం చెరువు, రంగశాయిపేట బంధం చెరువు ప్రధానమైన చెరువులు. ఇవి కాకుండా పలు కుంటలు కూడా ఉన్నాయి.



మీడియాతో మాట్లాడుతున్న సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా

కార్పొరేట్ శక్తులకు మోదీ ఊడిగం

- లోక్‌సభ ఎన్నికల్లో నైతికంగా ఓడిన బీజేపీ
- అత్తెసరు మెజారిటీతో ప్రభుత్వం ఏర్పాటు
- హిండెన్‌బర్గ్ ఆరోపణలపై విచారణకు జేపీసీ వేయాలి
- సెబీ చైర్మన్‌తో రాజీనామా చేయించాలి
- జమ్మూకశ్మీర్, హరియాణా ఎన్నికల్లో బీజేపీ ఓటమే
- సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీ డి.రాజా
- ఘనంగా ప్రారంభమైన సీపీఐ తెలంగాణ రాష్ట్ర నిర్మాణ కౌన్సిల్ సమావేశాలు


7

అంబానీ, ఆదానీ వంటి కార్పొరేట్ దిగ్గజాలకు దేశాన్ని అప్పగించి ప్రధాని మోదీ ఊడిగం చేస్తున్నారని సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా తీవ్రంగా విమర్శించారు. కేంద్రంలో పూర్తిస్థాయి మెజారిటీ రాకున్నా.. మిత్రపక్షాల సాయంతో ప్రభుత్వం ఏర్పాటు చేశారని అన్నారు. హనుమకొండలోని హరిత హోటల్‌లో సీపీఐ తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. జాతీయ, రాష్ట్ర నాయకులు పాల్గొన్న ఈ సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వ తీరుపై ఆయన విమర్శనాస్త్రాలు సంధించారు.

- ఆంధ్రజ్యోతి, హనుమకొండ

'వరంగల్ జిల్లా'కు గవర్నర్ రాక

- ఈ నెల 27 నుంచి మూడు రోజుల పాటు పర్యటన
- రచయితలు, కళాకారులు, ఉన్నతాధికారులతో సమావేశం
- చారిత్రక, పర్యాటక ప్రాంతాలను సందర్శించనున్న జిష్ణుదేవ్ వర్మ
- విస్తృత ఏర్పాట్లు చేస్తున్న ఆయా జిల్లాల కలెక్టర్లు



వివరాలు : 7లో..



రికార్డులను పరిశీలిస్తున్న డీఈవో జ్ఞానేశ్వర్

మోడల్ స్కూల్‌ను తనిఖీ చేసిన డీఈవో

గీసుగొండ, ఆగస్టు 22: మండలంలోని వంచనగిరి మోడల్ స్కూల్, కళాశాల హాస్టల్‌ను డీఈవో జ్ఞానేశ్వర్ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాస్టల్ విద్యార్థినులకు అందుతున్న భోజనాన్ని, నీటి వసతులను హాస్టల్ ఇన్‌చార్జ్ హిమబిందును అడిగి తెలుసుకున్నారు. అనంతరం రికార్డులను, విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పరిశీలించారు. మెనూ ప్రకారం రుచికరమైన భోజనాన్ని విద్యార్థులకు అందించాలని వంట నిర్వాహకులకు డీఈవో సూచించారు. పాఠశాల ఆవరణను మరింత శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పాఠశాల లోపలి ఆవరణలో ఎక్కడా నీరు నిలువకుండా ఇంకుడు గుంతలను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో జీసీడీవో ఫ్లోరెన్సా, ప్రిన్సిపాల్ నాగేశ్వర్‌రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు అన్యాయం చేయడం సరికాదు

- దమ్ముంటే ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసి మళ్లీ గెలవాలి
- గుర్తింపు కోసం పేదలను ఇబ్బంది పెడితే సహించం
- మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు

పోచమ్మమైదాన్, ఆగస్టు 22: వరంగల్ నగరంలో బీసీ నాయకుడు అని చెప్పుకుంటూ... నిరుపేద చిరు వ్యాపారుల డబ్బాలు కూలగొట్టించడం సరికాదని మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు అన్నారు. గ్రేటర్ వరంగల్ 22వ డివిజన్ పోచమ్మమైదాన్ ప్రాంతంలో గురువారం కొండా మురళీధర్‌రావు పర్యటించారు. నగరపాలక సంస్థ సిబ్బంది ఇటీవల రోడ్డుపై ఉన్న చిరువ్యాపారుల డబ్బాలను తొలగించడంతో వాటిని పరిశీలించి చిరు వ్యాపారులతో మాట్లాడారు. వారికి అండగా ఉంటామని హామీ ఇచ్చి 11మంది బాధితులకు ఒక్కొక్కరికి రూ.3వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన ఘాటు వ్యాఖ్యలు చేశారు. తాను ఎమ్మెల్సీగా యునానిమస్‌గా గెలిచినప్పటికీ పార్టీ మారినప్పుడు ఆత్మగౌరవంతో రాజీనామా చేసినట్లు తెలిపారు. నగరంలో బీసీ నాయకుడు అని చెప్పుకునే వ్యక్తి ఓ పార్టీ పరంగా గెలిచి, ప్రస్తుతం కాంగ్రెస్‌లో చేరారని,



చిరువ్యాపారులకు ఆర్థిక సాయం అందజేస్తున్న కొండా మురళీధర్‌రావు

పేదలను, కార్యకర్తలను ఇబ్బంది పెడితే చూస్తూ ఊరుకునేది లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గుర్తింపు కోసం పేదలను ఇబ్బంది పెట్టడం సరికాదని అన్నారు. దమ్ముంటే రాజీనామా చేసి మళ్లీ గెలవాలని సవాల్ విసిరారు. బీసీ నాయకుడిని అని చెప్పుకుంటూ పేదలకు అన్యాయం చేయడం ఏంటని ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదలను ఇబ్బంది పెట్టే పనులు మానుకోవాలని, లేదంటే అధిష్టానానికి ఫిర్యాదు చేస్తానని హెచ్చరించారు. తాము పేదల కోసమే పని చేస్తామని, వరంగల్‌లో కొండా దంపతులు ఉన్నంతవరకు ఎవ్వరికి అన్యాయం జరుగనివ్వమని భరోసా ఇచ్చారు. పోచమ్మమైదాన్ ప్రాంతంలోని నిరుపేదలకు పక్కా ఇళ్లు కట్టించే బాధ్యత కొండా దంపతులదని హామీ ఇచ్చారు. ఇతర పార్టీల నుంచి వచ్చే వారు రాజీనామా చేస్తేనే గౌరవం దక్కుతుందని అన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు బస్వరాజు కుమారస్వామి, సురేష్‌జోషి, ఫుర్ఖాన్, వస్కుల బాబు, కాంగ్రెస్ నాయకులు గోపాల నవీన్‌రాజ్, మహ్మద్ అయూబ్, కొక్కుల సతీష్, మీసాల ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్యపైనే పరోక్ష విమర్శలు?

మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు పేరు పెట్టకుండా బీసీ నాయకుడని చేసిన పరోక్ష విమర్శలు ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య పైనేనని పలువురు చర్చించుకుంటున్నారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీగా ఉన్న సారయ్య ఇటీవలే కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. పోచమ్మ దేవాలయం అభివృద్ధి కోసం అడ్డుగా ఉన్నాయన్న నెపంతో బస్వరాజు సారయ్య ఫిర్యాదు చేయడం వల్లనే చిరు వ్యాపారుల డబ్బాలను తొలగించారని ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో కొండా మురళీధర్‌రావు చేసిన విమర్శలు సారయ్య పైనేనని కాంగ్రెస్ కార్యకర్తలు బాహాటంగానే చర్చించుకుంటున్నారు.

సమష్టిగా కృషి చేద్దాం..

గంజాయిని తరిమికొడదాం..

- డ్రగ్ కంట్రోల్ టీమ్ ఏర్పాటుతో సత్ఫలితాలు
- వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ



వరంగల్ క్రైం, ఆగస్టు 22: ప్రజలు, పోలీసులు సమష్టిగా కృషి చేసి వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో గంజాయి నిర్మూలనకు కృషి చేద్దామని సీపీ అంబర్ కిషోర్ ఝూ ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. గంజాయి నిర్మూలనకు ఏర్పాటు చేసిన డ్రగ్ కంట్రోల్ టీమ్ పనితీరు గురించి సీపీ వివరించారు. నెల కిందట ఏర్పాటు చేసి డ్రగ్ కంట్రోల్ టీమ్ కమిషనరేట్ పరిధిలోని పాఠశాలలు, కళాశాలలు, వసతి గృహాలు, కోచింగ్ సెంటర్లు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లపై ప్రత్యేక నిఘా పెట్టిందన్నారు. గంజాయి విక్రయిస్తున్న వారిని, సేవిస్తున్న వారిని పట్టుకుందన్నారు. ఈ దాడుల్లో 14 కేసులు నమోదు చేసి 33 మంది గంజాయి విక్రయదారులను అరెస్టు చేసినట్లు సీపీ తెలిపారు. వీరి నుంచి రూ.3లక్షల విలువైన 11 కిలోల గంజాయిని, ఆరు ద్విచక్ర వాహనాలు, 44 సెల్‌ఫోన్లు, ఒక ట్యాబ్, ఒక ల్యాప్‌టాప్ స్వాధీనం చేసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. గంజాయి సేవిస్తూ పట్టుబడిన 68 మందికి కౌన్సెలింగ్ ఇచ్చి తల్లిదండ్రులకు అప్పగించినట్లు వివరించారు. గంజాయి విక్రయించే వారిపై, సేవించే వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. గంజాయి విక్రయిస్తున్నట్లు, సేవిస్తున్నట్లు గుర్తిస్తే 8712584473 నంబర్‌కు ఫోన్ చేయాలని సీపీ అంబర్ కిషోర్ ఝూ సూచించారు.

రైతులను దగా చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం

- మాజీ మంత్రి దయాకర్‌రావు, మాజీ ఎమ్మెల్యే నరేందర్

మట్టెవాడ, ఆగస్టు 22: రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం దగా చేసిందని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, వరంగల్ తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్‌లు ఆరోపించారు. రైతు రుణమాఫీపై మాట తప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం తీరుకు నిరసనగా బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ.రామారావు ఇచ్చిన పిలుపు మేరకు గురువారం వరంగల్ జిల్లా కేంద్రంలోని హెడ్‌పోస్టాఫీసు సెంటర్‌లో వరంగల్ తూర్పు మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున బీఆర్‌ఎస్ శ్రేణులు ధర్నా నిర్వహించారు. జిల్లాలోని వర్ధన్నపేట నియోజకవర్గ కేంద్రంలో జరిగిన ధర్నాలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డిలు పాల్గొన్నారు. మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ చేయకుండా రైతాంగాన్ని మోసం చేసిందని ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డిలు ధ్వజమెత్తారు. ఆగస్టు 15లోపు రూ.2లక్షల రుణమాఫీ చేస్తానని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పిన మాటలు మోసపూరితమైనవని దుయ్యబట్టారు.



వర్ధన్నపేటలో మాట్లాడుతున్న ఎర్రబెల్లి దయాకర్‌రావు

నర్సంపేట నియోజకవర్గ కేంద్రంలో బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు నాగెల్లి వెంకటనారాయణగౌడ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున బీఆర్‌ఎస్ శ్రేణులు ధర్నా నిర్వహించారు. అదేవిధంగా వివిధ మండల కేంద్రాల్లో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ధర్నా చేపట్టారు. వర్ధన్నపేట నియోజకవర్గంలో ధర్నాను ద్దేశించి ఎర్రబెల్లి మాట్లాడుతూ రుణమాఫీ విషయంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రైతులను మోసం చేసిందన్నారు. రైతులకు ఆంక్షలు లేని రుణమాఫీని ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని, అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. వరంగల్‌లో మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ మాట్లాడుతూ రైతు రుణమాఫీపై కాంగ్రెస్ మాట తప్పిందని, మోసపూరిత హామీలు ఇచ్చి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు. ఆంక్షలు, షరతులతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.

అస్తవ్యస్తం!

- సమస్యల వలయంలో రైతు వేదికలు
- నిధులు రాక నిర్వహణ గాలికి..
- రెండేళ్లుగా అందని నిధులు
- ఏఈవోలపైనే అదనపు భారం



ఆరెపల్లి గ్రామంలోని రైతు వేదిక భవనం



పగుళ్లు బారిన వరండా

వరంగల్ వ్యవసాయం, ఆగస్టు 22: రైతులకు మెరుగైన సేవలందించాల్సిన రైతు వేదికల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. ప్రభుత్వం నుంచి సకాలంలో నిధులు రాకపోవడంతో సమస్యల వలయంలో కూరుకుపోయాయి. గత రెండేళ్లుగా రైతు వేదికల నిర్వహణకు నిధులను ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో నిర్వహణ ఏఈవోలకు భారంగా మారింది. హనుమకొండ, వరంగల్ జిల్లాలకు కలిపి సుమారు రూ.2.5కోట్ల వరకు రావాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు. ఆ నిధులు విడుదల కాకపోవడంతో ఏఈవోలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం బకాయిలు చెల్లించడంతో పాటు నెలనెలా సకాలంలో రైతు వేదికల నిర్వహణ నిధులను విడదల చేయాలని వ్యవసాయ శాఖ అధికారులు కోరుతున్నారు.

వరంగల్‌లో 59, హనుమకొండలో 55 రైతు వేదికలు

గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతులకు మెరుగైన సేవలందించాలని, ఆర్థింగా బలోపేతం చేయాలని రాష్ట్రంలో 5వేల ఎకరాలకు ఒక క్లస్టర్(ఒకటి) చొప్పున, ఒక్కో దానికి సుమారు రూ.22లక్షలు వెచ్చించి వరంగల్ జిల్లాలో 59, హనుమకొండ జిల్లాలో 55 రైతు వేదికలను నిర్మించింది. మొదటి పది నెలల పాటు నిర్వహణ నిధులను విడుదల చేసింది. ఒక్కో రైతు వేదిక నిర్వహణకు నెలకు రూ9వేలు ఖర్చు అవుతుందని గత ప్రభుత్వం లెక్కగట్టి విడుదల చేసింది. విద్యుత్ బిల్లులకు రూ.1000, పారిశుధ్య నిర్వహణకు రూ.3వేలు, రైతు శిక్షణలకు రూ.2500, తాగునీటికి రూ.500, మరమ్మతులు, స్టేషనరీ, జిరాక్స్, ఇతర ఖర్చులకు రూ.2వేలు కేటాయించింది. ఈ లెక్కన ఒక్కో రైతు వేదిక నిర్వహణ ఖర్చులు 24 నెలలకు గాను రూ.2.16 లక్షల వరకు ప్రభుత్వం విడుదల చేయాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు. 2022, ఆగస్టు నుంచి నిధుల విడుదల నిలిపివేయడంతో అప్పటి నుంచి వాటి నిర్వహణకు ఏఈవోలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్నిచోట్ల రైతు వేదికల నిర్వహణ భారమై గాలికి వదిలేశారు. దీంతో నిర్వహణ నిధులు లేక సమస్యల వలయంలో చిక్కుకున్నాయి. సరైన సౌకర్యాలు లేక రైతులు, ఏఈవోలు వాటిని వినియోగించుకోవడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నిధులను విడుదల చేయాలని ఏఈవోలు కోరుతున్నారు.

రైతు వేదికలే రైతు నేస్తాలు..

కొత్తగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటయ్యాక గత ప్రభుత్వం నిర్మించిన రైతు వేదికల్లో దృశ్య శ్రవణ (వీడియో కాన్ఫరెన్సింగ్) సేవలను రైతు నేస్తం పేరిట తొలి విడతలో నియోజకవర్గానికి ఒకటి చొప్పున ఎంపిక చేసి వాటిల్లో రైతులకు ఆన్‌లైన్‌లో శిక్షణ ఇచ్చారు. ప్రస్తుతం మండల కేంద్రాలకు విస్తరించి రైతు నేస్తం కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. రైతు నేస్తం కార్యక్రమాలలో ముఖ్యంగా వ్యవసాయంలో విస్తరణ కార్యకలాపాలను బలోపేతం చేయడం, నూతన సాంకేతికపై అవగాహన కల్పించి సాగును లాభసాటి చేయడం, రైతుల సమస్యలను పరిష్కరించి కొత్త విధానాలను రూపొందించడమే

మిగతా 8వ పేజీలో..

వ్యవసాయ శాఖలో
అధికారుల బదిలీలు

బాలసముద్రం, ఆగస్టు22: హనుమకొండ జిల్లా వ్యవసాయశాఖలో అధికారులు బదిలీ అయినట్లు జిల్లా వ్యవసాయశాఖ అధికారులు గురువారం తెలిపారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ డైరెక్టర్ డాక్టర్ గోపి ఆదేశాలతో మల్టీజోన్-1పరిధిలోని హనుమకొండ, వరంగల్ జిల్లాలో పని చేస్తున్న అధికారులకు సాధారణ బదిలీలు అయినట్లు తెలిపారు. ఎం.లక్ష్మీనారాయణ మహబూబాబాద్ నుంచి హనుమకొండ ఏడీఏగా, హనుమకొండ ఏడీఏగా పని చేసిన కె.దామోదర్‌రెడ్డి నర్సంపేటకు బదిలీ అయ్యారు. అగ్రికల్చర్ టెక్నికల్ ఏవోలుగా అఫ్జల్‌పాషా, భీమదేవరపల్లి నుంచి హనుమకొండకు బదిలీ కాగా, బి.మాధవి హనుమకొండ నుంచి దుగ్గొండికి బదిలీ అయ్యారు. కాజీపేట ఏవోగా పని చేసిన శ్రీధర్‌రెడ్డి హనుమకొండ అగ్రికల్చర్ టెక్నికల్ ఏవోగా వచ్చారు. భీమదేవరపల్లి ఏవోగా రాజేష్, నూతన మండలం వేలేరు ఏవోగా లలిత, ఐనవోలు ఏవోగా సీహెచ్. సునీల్‌కుమార్, నడికూడ ఏవోగా పోరిక జైసింగ్, దామెర ఏవోగా రాకేష్‌లు బదిలీలపై వచ్చినట్లు జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. వరంగల్, హనుమకొండ హార్టికల్చర్ జాయింట్ డైరెక్టర్‌గా జి.సంగీత నల్లగొండ జిల్లా నుంచి బదిలీపై వచ్చారు. వరంగల్ హార్టికల్చర్ జాయింట్ డైరెక్టర్‌గా పని చేసిన శ్రీనివాసరావు కరీంనగర్‌కు బదిలీ అయ్యారు. వరంగల్, హనుమకొండ జిల్లా హార్టికల్చర్ అధికారిగా చెరల రాకేష్ తొర్రూర్ నుంచి బదిలీపై వచ్చినట్లు అధికారులు తెలిపారు.

ఓపెన్ స్కూల్ సప్లిమెంటరీ పరీక్షల ఫీజు చెల్లించాలి

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 22: ఓపెన్ స్కూల్ ద్వారా నిర్వహిస్తున్న ఓపెన్ టెన్త్, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల ఫీజును ఈ నెల 30లోపు చెల్లించాలని ఓపెన్ స్కూల్ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ మురాల శంకర్‌రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అక్టోబర్‌లో నిర్వహించే సప్లిమెంటరీ పరీక్షలకు మీసేవ, టీఎస్‌ఆన్‌లైన్ తదతర కేంద్రాల ద్వారా ఫీజు చ్లెలంచాలని తెలిపారు. ఆగస్టు 30 వరకు ఎలాంటి అపరాధ రుసుము లేకుండా, సెప్టెంబర్ 4 వరకు రూ. 25 అపరాధ రుసుముతో, సెప్టెంబర్ 9 వరకు రూ. 50 అపరాధ రుసుముతో చెల్లించేందుకు అవకాశం ఉందని పేర్కొన్నారు.

నేటి నుంచి సెమీ డీలక్స్ ఆర్టీసీ సర్వీసులు

బాలసముద్రం, ఆగస్టు 22: వరంగల్ రీజియన్ పరిధిలో సెమీ డీలక్స్ ఆర్టీసీ బస్సు సర్వీసులను శుక్రవారం నుంచి నూతనంగా నడుపనున్నట్లు రీజినల్ మేనేజర్ డి.విజయభాను గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. హనుమకొండ నుంచి భూపాలపల్లి, ఏటూరునాగారం, కాళేశ్వరం రూట్లలో సెమీ డీలక్స్ బస్సు సర్వీసులను నడుపనున్నట్లు తెలిపారు. హనుమకొండ నుంచి ఏటూరునాగారం టికెట్ ధర ఎక్స్‌ప్రెస్ రూ.160, సెమీ డీలక్స్ రూ.180, డీలక్స్ రూ.190, హనుమకొండ నుంచి భూపాలపల్లికి ఎక్స్‌ప్రెస్ రూ.100, సెమీ డీలక్స్ రూ.110, డీలక్స్ రూ.110, హనుమకొండ నుంచి కాళేశ్వరం ఎక్స్‌ప్రెస్ రూ.160, సెమీ డీలక్స్ రూ.180, డీలక్స్ రూ.190 కాగా, బస్సు ప్రయాణం చేసిన ప్రతీ ఒక్కరు టికెట్ తీసుకోవలసి ఉంటుందన్నారు.

కార్పొరేట్ శక్తులకు మోదీ ఊడిగం

● జమ్మూకశ్మీర్, హరియాణా ఎన్నికల్లో బీజేపీ ఓటమి ఖాయం ● తెలంగాణలో సీపీఐకి ఇచ్చిన హామీని కాంగ్రెస్ నిలబెట్టుకోవాలి

● సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీ డి.రాజా ● ఘనంగా ప్రారంభమైన సీపీఐ తెలంగాణ రాష్ట్ర నిర్మాణ కౌన్సిల్ సమావేశాలు

హనుమకొండ, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో నరేంద్రమోదీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తోందని, ఆదానీ, అంబానీలకు దేశ సంపదను దోచిపెడుతోందని సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీ డి.రాజా ఆరోపించారు. గురువారం హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో సీపీఐ తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్ నిర్మాణసమావేశాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజులపాటు జరిగే ఈ సమావేశాలకు రాజా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మోదీ విధానాలను తూర్పారబట్టారు. మోదీ అండదండలతో కార్పొరేట్ శక్తులు దేశాన్ని నిలువునా దోచుకుంటున్నాయని ధ్వజమెత్తారు. ఇటీవల ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్.. కార్పొరేట్ శక్తుల కొమ్ముకాసేలా ఉందన్నారు. సామాన్యుల ఆశలు, ఆకాంక్షలు ఆ బడ్జెట్‌లో ఏ మాత్రం ప్రతిఫలించలేదని అన్నారు. బడ్జెట్‌లో విద్య, వైద్యం, తదితర కీలక రంగాలకు ఎలాంటి నిధులు కేటాయించలేదన్నారు. నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించే ఏ చర్యను బడ్జెట్‌లో ప్రతిపాదించలేదన్నారు. దేశంలో నిరుద్యోగ సమస్య అంతకంతకూ పెరిగిపోతోందని, పరిష్కారానికి మోదీ ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. రూపాయి విలువ దారుణంగా పతనమవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు.

ఆదానీ, అంబానీ అక్రమాలపై విచారణ జరపాలని డి.రాజా డిమాండ్ చేశారు. ఆదానీ గ్రూపులో సెబీ ఛైర్మన్ విదేశాల్లో అక్రమ పెట్టుబడులు పెట్టారంటూ హిండెన్‌బర్గ్ సంస్థ చేసిన ఆరోపణలపై ప్రస్తుతం దేశవ్యాప్తంగా చర్చ జరుగుతోందని, దీనిపై విచారణకు జాయింట్ పార్లమెంట్ కమిటీ (జేపీసీ) వేయాలని రాజా డిమాండ్ చేశారు. హిండెన్ బర్గ్ ఆరోపణల నేపథ్యంలో సెబీ ఛైర్మన్‌తో రాజీనామా చేయించాలన్నారు. ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ సాధించింది గెలుపుకాదని, ప్రజల ఆ పార్టీని నైతికంగా ఓడించం ద్వారా తగిన గుణపాఠం చెప్పారన్నారు. 400 స్థానాలతో అధికారంలోకి వస్తామని ఎన్నికల ప్రచార సభల్లో పదేపదే చెప్పిన మోదీ.. 250లోపు సీట్లకే పరిమిత మయ్యారన్నారు. నితీష్‌కుమార్, చంద్రబాబు నాయుడు ఊతకర్రల సాయంతో కేంద్రంలో మూడోసారి మోదీ ప్రభుత్వం ఏర్పాటైందని, ఈ ఇద్దరి మద్దతు ఎంతకాలం ఉంటుందనేది పెద్ద ప్రశ్న అని అన్నారు. అభివృద్ధి చెందిన దేశంగా భారత్ మారిందని మోదీ చెబుతున్నా.. ప్రజలకు రేషన్ ఉచితంగా ఇచ్చే పరిస్థితి ఇంకా ఎందుకు ఉందని ప్రశ్నించారు. ఇప్పటికీ దేశంలోని నిరుపేదల్లో చాలా మందికి రేషన్‌కార్డులు లేవని, ఇది దేశ వ్యాప్త సమస్య అని, వారందరికీ కార్డులు ఇచ్చే



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న డి.రాజా

దిశగా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదన్నారు.

పశ్చిమ బెంగాల్‌లో ఒక మెడికో విద్యార్థినిపై అత్యాచార సంఘటనపై దేశవ్యాప్తంగా అట్టుడుకుతున్నా..మోదీ మౌనం వీడడం లేదని రాజా పేర్కొన్నారు. దేశంలో మహిళలపై దాడులు రోజు రోజుకూ పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. చివరికి సుప్రీం కోర్టు జోక్యం చేసుకోవలసిన పరిస్థితి ఎందుకు వచ్చిందని నిలదీశారు. వైద్యవృత్తిలో కొనసాగుతున్నవారికి రక్షణ కోసం ఒక కేంద్ర చట్టాన్ని తీసుకురావాలన్న డిమాండ్‌ను మోదీ అంగీకరించడం లేదని రాజా ఆరోపించారు. ప్రైవేటు రంగంలోనూ రిజర్వేషన్లను అమలు చేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ రాజ్యాంగంపై ప్రత్యక్షంగా దాడి చేస్తోందని, ప్రజాస్వామిక విలువలను కాలరాస్తోందన్నారు. మనది భిన్నత్వంలో ఏకత్వం కలిగిన దేశమని, ఈ భావనకు తూట్లు పొడుస్తూ రాజ్యాంగ, ప్రజాస్వామ్య, లౌకిక విధానాలకు భిన్నంగా ఒకే దేశం.. ఒకే ఎన్నిక, ఒకే దేశం.. ఒకే మతం వంటి నినాదాలతో మోదీ ప్రభుత్వం విచ్ఛిన్నకర పాలనను సాగించాలని చూస్తోందని ధ్వజమెత్తారు. బ్యూరోక్రసీలోకి ఆర్ఎస్ఎస్ శక్తులను జొప్పించే ప్రయత్నం మోదీ చేస్తున్నారని, ఇదే జరిగితే భవిష్యత్తులో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడుతోందన్న ఆవేదన ఆయన వ్యక్తం చేశారు.

రాజ్యాంగం స్థానంలో కొత్త మతతత్వ రాజ్యాంగాన్ని తేవడానికి బీజేపీ, ఆర్ఎస్ఎస్ కుట్రలు చేస్తున్నాయని రాజా అన్నారు. నిత్యం రామజపం చేసే బీజేపీకి రాముడు జన్మించిన ప్రదేశంలోనే ప్రజలు ఓటుతో ఓడించి బుద్ధి చెప్పారన్నారు. మోదీ అనుసరిస్తున్న విధానాల పట్ల జమ్మూ కశ్మీర్ ప్రజలు తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారని, అక్కడ శాంతి భద్రతలను కాపాడేందుకే చర్యలు తీసుకున్నామని గొప్పగా చెబుతున్నప్పటికీ ఇప్పటికీ ఉగ్రవాదుల మారణకాండ కొనసాగుతూనే ఉందన్నారు. జమ్మూకశ్మీర్, హరియాణాలో త్వరలో జరగనున్న ఎన్నికల్లో బీజేపీ ఓటమి ఖామన్నారు. ఆ తర్వాత మహారాష్ట్ర, జర్ఖండ్ రాష్ట్రాల్లో కూడా ఇదే పరిస్థితి పునరావృతం అవుతుందని రాజా జోస్యం చెప్పారు. కశ్మీర్‌లో పరిస్థితులను చక్కదిద్దడంలో మోదీ దారుణంగా విఫలమయ్యారని విమర్శించారు. వినేష్ పొగట్ ఒలంపిక్‌లో గోల్డ్‌మెడల్ తెచ్చేవారని, బీజేపీ అనుసరించిన విధానాల వల్లే పతకం జేజారిందని చెప్పారు. మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న అప్రజాస్వామిక, రాజ్యాంగ వ్యతిరేక, మతతత్వ విధానాలను అడ్డుకునేందుకు ప్రజాస్వామికవాదులు, ప్రజలు ఒక్కటికావాలని రాజా పిలుపు నిచ్చారు. ఇటీవలి లోకసభ ఎన్నికల్లో కాంగ్రెస్ ఓట్లు, సీట్లను పెంచుకోవడం ద్వారా బలమైన ప్రతిపక్షంగా నిలబడిందని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రెండు ఎమ్మెల్సీ సీట్లు ఇస్తానని చెప్పి జాప్యం చేస్తోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై కొద్దినెలలే అయినందువల్ల వేచిచూస్తున్నామన్నారు.

సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ సృష్టించిన సంక్షోభం నుంచి కాంగ్రెస్ ప్రభుత్వం బయటపడలేకపోతోందన్నారు. రుణమాఫీ వంద శాతం అమలు కాలేదని ప్రజల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజావ్యతిరేకతను మూటకట్టుకోవద్దని కోరుకుంటున్నామన్నారు. ప్రజల ఆకాంక్ష మేరకు పాలన సాగని పక్షంలో పోరాటం చేస్తామని కూనంనేని వెల్లడించారు. బీఆర్ఎస్ పని అయిపోయిందని, బీజేపీని నిలువరించడంతో పాటు సీపీఐ బలోపేతానికి కృషి చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో బీజేపీ బలపడకుండా అడ్డుకునేందుకు కాంగ్రెస్‌కు తమ పార్టీ మద్దతు కొనసాగుతుందని స్పష్టం చేశారు. ప్రజాసమస్యలపై నిత్యం పోరాడుతున్న సీపీఐని మరింత బలోపేతం చేయడానికి అనుసరించాల్సిన విధివిధానాలపై కౌన్సిల్ నిర్మాణ సమావేశంలో లోతుగా చర్చించనున్నట్టు తెలిపారు. ఇప్పటికే జిల్లా, మండల, గ్రామ స్థాయిలో కౌన్సిల్ నిర్మాణ సమావేశాలను పూర్తి చేసుకున్నామన్నారు. డిసెంబర్ 25నాటికి సీపీఐ వందేళ్లు పూర్తి చేసుకుంటుందని తెలిపారు. తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తితో ప్రజాసమస్యలపై ఒక క్రియాశీల, మిలిటెంట్ పార్టీగా సీపీఐ పోరాటాలు కొనసాగిస్తోందని చెప్పారు.

ఈ విలేకరుల సమావేశంలో సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ నారాయణ, జాతీయ కార్యదర్శివర్గ సభ్యుడు చాడా వెంకటరెడ్డి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు, సీపీఐ నాయకుడు అజీజ్‌పాషా, జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు డి.రాజా సమావేశాల ప్రాంగణంలో పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం రాష్ట్రకార్యవర్గం సమావేశమైంది. వివిధ అంశాలపై చర్చించింది.



హనుమకొండలో సీపీఐ జెండా ఎగురవేస్తున్న జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా, నాయకులు

అట్టహాసంగా సీపీఐ సమావేశాలు ప్రారంభం

హాజరైన సీపీఐ జాతీయ నేతలు డి.రాజా, చాడ వెంకట్‌రెడ్డి, నారాయణ

విడతల వారీగా సమావేశాలు నిర్వహించిన నేతలు

బాలసముద్రం, ఆగస్టు 22: రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల విధానాలపై ప్రస్తుత రాజకీయాలు, పార్టీ బలోపేతం చేయడానికి ఏర్పాటు చేసిన సీపీఐ తెలంగాణ రాష్ట్ర నిర్మాణ కౌన్సిల్ సమావేశాలు హనుమకొండలోని హరితకాకతీయ హోటల్‌లో గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 8గంటలకు హరిత హోటల్‌కు చేరుకున్న జాతీయ నాయకులకు జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. సీపీఐ జాతీయ ప్రధానకార్యదర్శి డి.రాజా సీపీఐ జెండాను రాష్ట్ర నాయకులతో కలిసి ఎగురవేశారు. అనంతరం హరితహోటల్‌లో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆధ్వర్యంలో మొదటగా రాష్ట్ర కార్యదర్శి, వర్గ సభ్యు లు 11 మందితో, సమావేశం నిర్వహించారు. తరువాత 31 మంది ఎగ్జిక్యూటీవ్‌లతో సమావేశం నిర్వహించారు. అనంతరం 137 మంది స్టేట్ కౌన్సిల్ మెంబర్‌లతో జాతీయ ప్రధానకార్యదర్శి డి.రాజా, జాతీయ కార్యదర్శులు నారాయణ, చాడ వెంకటరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు పాల్గొని పార్టీ నిర్ణయాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



సీపీఐ కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న డి.రాజా

ప్రజాసమస్యలపై ఉద్యమిస్తేనే పార్టీ బలోపేతం

నిత్యం ప్రజా సమస్యలపై ఉద్యమించినప్పుడే కమ్యూనిస్టు పార్టీని మరింత బలోపేతం చేయవచ్చని సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి. రాజా అన్నారు. హనుమకొండలోని కాకతీయ హరిత హోటల్‌లో గురువారం సీపీఐ పార్టీ నిర్మాణ కౌన్సిల్ సమావేశాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి ఆధ్వర్యంలో తొలిరోజు ఘనంగా నిర్వహించారు. ముందుగా ఇటీవల వివిధ రాష్ట్రాలలో మరణించిన సీపీఐ నాయకులు, వామపక్ష ప్రజాస్వామ్యవాదుల చిత్రపటాలకు నివాళులు అర్పించి సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా డి.రాజా మాట్లాడుతూ.. దేశంలో వేగంగా మారుతున్న రాజకీయ పరిణామాలను పార్టీ నాయకులకు వివరించారు. ఈనేపథ్యంలో పెట్టుబడిదారీ శక్తులకు ధీటుగా కమ్యూనిస్టులు పని చేయాలని అన్నారు. అట్టడుగు వర్గాలను చైతన్యవంతులను చేయాలని కమ్యూనిస్టు నాయకులను కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జాతీయ కార్యదర్శులు డాక్టర్ కె. నారాయణ, సయ్యద్ అజీజ్‌పాష, కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి, పశ్య పద్మ, పల్ల వెంకటరెడ్డి, తక్కళ్లపెల్లి శ్రీనివాసరావు, కలవేని శంకర్, వీఎస్ బోస్, బాల మల్లేశ్, బాల నరసింహాలు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన సీపీఐ నాయకులు



డి.రాజాకు పుష్పగుచ్ఛం అందిస్తున్న వినయభాస్కర్

సీపీఐ నేతలను కలిసిన వినయభాస్కర్

బాలసముద్రం, ఆగస్టు 22: హనుమకొండ మాజీ ఎమ్మెల్యే, మాజీ ప్రభుత్వ చీఫ్ విప్, హనుమకొండ బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ గురువారం సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీ డి.రాజా, జాతీయ కార్యదర్శులు చాడా వెంకటరెడ్డి, కూనంనేని సాంబశివరావులను హనుమకొండలోని హరిత హోటల్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ నిర్మాణ సమావేశాలకు హాజరైన జాతీయ నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. అక్కడికి బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే వినయ్ భాస్కర్ హాజరై జాతీయ నాయకులను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

ఈ సందర్భంగా వినయ్ భాస్కర్ హనుమకొండలో చాలాసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందినట్లు జాతీ య నాయకులకు కూనంనేని సాంబశివరావు పరిచ యం చేశారు. అనంతరం వినయ్ భాస్కర్‌తో ఎమ్మెల్యే కూనంనేని సరదాగా మాట్లాడుతూ.. మీరు చేసుకున్న అపకారమే మీ ఓటమికి కారణాలని అనగా.. వినయ్‌భాస్కర్ అక్కడి నుంచి నవ్వుకుంటూ బయటకు వెళ్లిపోయారు. కాగా సీపీఐ జాతీయ నాయకులను వినయ్ భాస్కర్ కలవడంపై పలువురు ఆసక్తిగా చర్చించుకున్నారు.

‘వరంగల్ జిల్లా’కు గవర్నర్ రాక

ఈ నెల 27 నుంచి మూడు రోజుల పాటు పర్యటన

వరంగల్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ఈనెల 27, 28, 29 తేదీల్లో ఉమ్మడి వరంగల్ జిల్లాలో పర్యటించనున్నారు. తన పర్యటనలో యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప ఆలయంతో పాటు ఓరుగల్లులోని అనేక చరిత్రాత్మక కట్టడాలు, లక్నవరం సరస్సును సందర్శించనున్నారు. అలాగే ఉత్తమ ఉద్యోగులతో పాటు కవులు, కళాకారులు, రచయితలతో పరిచయ కార్యక్రమం ఉంటుంది. అలాగే పలువురిని సన్మానించనున్నారు.

గవర్నర్ పర్యటన ఇలా..

● 27వ తేదీ మంగళవారం ఉదయం 7గంటలకు గవర్నర్ హైదరాబాద్‌లోని రాజ్‌భవన్ నుంచి రోడ్డు మార్గాన బయలుదేరి ఉదయం 8గంటలకు భువనగిరి జిల్లాలోని యాదగిరి లక్ష్మీనర్సింహస్వామి ఆలయానికి చేరుకుంటున్నారు. అక్కడ స్వామి వారిని దర్శించుకుంటారు. అనంతరం 8.45లకు రోడ్డు మార్గాన బయలుదేరి ములుగు జిల్లా కలెక్టరేట్‌కు 11.30గంటలకు చేరుకుంటారు. 12గంటల వరకు విశ్రాంతి తీసుకుంటారు. మధ్యాహ్నం 1గంటకు ఉన్నతాధికారులతో పరిచయం కార్యక్రమం ఉంటుంది. అప్పటి నుంచి 3గంటల వరకు రచయితలు, ఆర్టిస్టులతో పాటు రాష్ట్ర, జాతీయస్థాయిలో అవార్డులు పొందిన వారితో సమావేశం నిర్వహిస్తారు. మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప ఆలయాన్ని సందర్శిస్తారు. పక్కనే ఉన్న భూపాలపల్లి జిల్లా గణపురం మండలకేంద్రంలోని గణపేశ్వరాలయంను సైతం గవర్నర్ సందర్శించనున్నారు. అక్కడి నుంచి గోవిందరావుపేట మండలంలోని లక్నవరం సరస్సు వద్దకు సాయంత్రం 6.30గంటలకు చేరుకుని అక్కడే రాత్రి బస చేస్తారు.

● 28వ తేదీ బుధవారం ఉదయం లక్నవరం అందాలను ఆస్వాదిస్తారు. ఆపై ఉదయం 8గంటలకు లక్నవరం నుంచి బయలుదేరి 9.15గంటలకు హనుమకొండలోని నిట్ గెస్ట్‌హౌస్‌కు చేరుకుంటారు. 9.45వరకు గెస్ట్‌హౌస్‌లో విశ్రాంతి తీసుకుంటారు. ఉదయం 10గంటలకు హనుమకొండ సమీకృత కలెక్టరేట్‌కు గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ చేరుకుంటారు. 11.05గంటల నుంచి 12.05గంటల వరకు ఉన్నతాధికారులతో పరిచయ కార్యక్రమం ఉంటుంది. మధ్యాహ్నం 12.15గంటల నుంచి 2.30గంటల వరకు రచయితలు, కళాకారులతో పాటు రాష్ట్ర, జాతీయస్థాయిలో అవార్డులు పొందినవారితో గవర్నర్ పరిచయ కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు ఖిలావరంగల్ కోట, వేయిస్తంభాల ఆలయం, భద్రాకాళి దేవాలయం, పద్మాక్షి గుడితోపాటు నగరంలోని ఇతర ముఖ్యమైన ప్రదేశాలను గవర్నర్ సందర్శిస్తారు. సాయంత్రం 6.40గంటలకు నిట్ గెస్ట్‌హౌస్‌కు చేరుకుని రాత్రి బస చేస్తారు.

● 29వ తేదీ గురువారం ఉదయం 9గంటలకు గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ జనగామ జిల్లాకు బయలుదేరి వెళతారు. 10 గంటలకు జనగామ జిల్లా కలెక్టరేట్‌కు చేరుకుని ఉ.11.15గంటల వరకు అధికారులతో పరిచయ కార్యక్రమంలో పాల్గొంటారు. ఉదయం 11.35గంటలకు ఒబుళాకేశ్వాపూర్ గ్రామానికి చేరుకుంటారు. మధ్యాహ్నం 2గంటల వరకు రచయితలు, కళాకారులతో పాటు రాష్ట్ర, జాతీయ స్థాయిలో అవార్డులు పొందినవారితో పరిచయ కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 2.10గంటలకు ఒబుళాకేశ్వాపూర్ నుంచి గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ రోడ్డు మార్గాన బయలుదేరి భువనగిరి జిల్లా కొలనుపాకు వెళ్లనున్నారు. దీంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో మూడు రోజుల గవర్నర్ పర్యటన ముగుస్తుంది. కాగా, గవర్నర్ పర్యటన నేపథ్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వరంగల్, హనుమకొండ, ములుగు, భూపాలపల్లి, జనగామ జిల్లా కలెక్టర్లు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు.

అధికారులు నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదు

నీటి పారుదల శాఖ అధికారులతో స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కడియం శ్రీహరి

బాలసముద్రం, ఆగస్టు 22: స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలో ఏడాదిలోపు సాగునీటి పనులన్నీ త్వరితగతిన పూర్తి చేయాలని, ప్రతీ ఎకరానికి సాగునీరు అందించేందుకు అధికారులు క్షేత్రస్థాయిలో కాల్వల పనులను పరిశీలించి వెంటనే నివేదిక ఇవ్వాలని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అధికారులను ఆదేశించారు. గురువారం చింతగట్టులోని నీటిపారుదల శాఖ కార్యాలయంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీహరి మాట్లాడుతూ.. దేవాదుల ప్రాజెక్ట్ ద్వారా నియోజకవర్గంలోని ప్రతీ ఎకరానికి సాగునీరు అందించడమే తన లక్ష్యమన్నారు. అధికారులు విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదని ఈసందర్భంగా హెచ్చరించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దేవాదుల ప్రాజెక్ట్‌కు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారని గుర్తు చేశారు. జనగామ జిల్లాలో ఆశించిన స్థాయిలో వర్షాలు లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడకుండా గోదావరి జలాలను పంటలకు అందించేందుకు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ధర్మసాగర్ సౌత్ కెనాల్, నవాబ్‌పేట మెయిన్ కెనాల్, అశ్వరావుపేట రిజర్వాయర్, నష్కల్ నుంచి పాలకుర్తితో పాటు గండి రామారం రిజర్వాయర్ కింద డిస్ట్రిబ్యూటరీ కాల్వలలో పేరుకుపోయిన పూడిక, జంగిల్ క్లియరెన్స్‌తో పాటు ఇతరత్రా పనులను గుర్తించి అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన చేసి 15 రోజుల్లోగా సమగ్రమైన నివేదిక అందించాలని అధికారులకు తెలిపారు. ఈ సమావేశంలో సీఈ అశోక్, వరంగల్ ఎస్ఈ వెంకటేశ్వర్లు, జనగామ ఎస్ఈ సుధీర్, నీటిపారుదల శాఖ అధికారులు పాల్గొన్నారు.

అంతరాష్ట్ర మోసాలకు పాల్పడుతున్న ముఠా అరెస్టు

● నకిలీ ప్రెస్, సీబీఐ, కార్డులతో మోసాలు ● రూ.1కోటి 34లక్షలు టోకరా ● వివరాలు వెల్లడించిన సుబేదారీ సీఐ సత్యనారాయణ

బాలసముద్రం, ఆగస్టు 22: వివిధ రాష్ట్రాలలో నకిలీ ప్రెస్‌కార్డులు, సీబీఐ కార్డులు చూపించి ఉద్యోగాల పేరుతో మోసాలకు పాల్పడుతున్న అంతరాష్ట్ర ముఠాను గురువారం సుబేదారి పోలీసులు అరెస్టు చేశారు. సీఐ సత్యనారాయణరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి చెందిన నిమిత్ కెపాసి (ఆలియాస్) అమిత్‌కుమార్ (47), సమన్ కాపాసి (ఆలియస్)కాసోజు జయ(42) ఇద్దరూ కలిసి వివిధ కంపెనీలలో పెట్టుబడి పేరుతో ఇతర రాష్ట్రాల్లో మోసాలకు పాల్పడ్డారు. అమిత్‌కుమార్ 2023లో హనుమకొండ జూలైవాడకు చెందిన సయ్యద్ రియాజ్, ప్రవీణ్ కుమార్‌లను పరిచయం చేసుకొని వారికి తన కంపెనీలో ఉద్యోగం ఇచ్చాడు. అదే విధంగా మరికొంత మంది యువకులను నియమించుకుని వారి అకౌంట్ నెంబర్లకు అమిత్‌కుమార్ సెల్ నంబర్ జత చేసి సైబర్ నేరాలకు పాల్పడ్డాడు. తన కంపెనీ సిబ్బంది వసూలు చేసిన డబ్బులను వారి అకౌంట్‌లో వేసుకుంటే అమిత్‌కుమార్ అకౌంట్‌కు డబ్బులు వచ్చే విధంగా మార్చుకుని అమాయకులను మోసం చేశాడు.



సుబేదారి పోలీసు స్టేషన్‌లో వివరాలు వెల్లడిస్తున్న సీఐ సత్యనారాయణరెడ్డి

వరంగల్, హైదరాబాద్, పూణే, విశాఖపట్నం నగరాలలో పలు కంపెనీలైన స్పీకింగ్ కంపెనీ ప్రైవేటు లిమిటెడ్, మాట్రీ మోని, ఓవర్‌సిస్ కన్సల్టెన్సీ, బ్యాంకు లోన్స్ తదితరు కంపెనీలలో ఉద్యోగాల పేరుతో డబ్బులు వసూలు చేశారు. హిందీ, ఇంగ్లీష్, గుజరాతీ, బెంగాలీ భాషలలో అనర్గళంగా మాట్లాడుతూ ఆధార్‌కార్డు, పాన్ కార్డు అడ్రస్‌లు మార్చి నిందితులు మోసాలకు పాల్పడుతూ సుమారు రూ.1కోటి 34లక్షలు వసూలు చేసినట్లు సీఐ తెలిపారు. వీరిని గురువారం సుబేదారి పోలీసుస్టేషన్ పరిధిలోని సాయినగర్ కాలనీలో అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు సీఐ సత్యనారాయణరెడ్డి తెలిపారు. ఇలాంటి మోసాలు చేసే వారి విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై శ్రీకాంత్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఏనుమాముల మార్కెట్‌లో మక్కలకు మంచి ధర

గరిష్ఠంగా క్వింటాకు రూ.2,821

వరంగల్ వ్యవసాయం, ఆగస్టు 22: వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో గురువారం మొక్కజొన్నలకు మంచి ధర పలికింది. ఇప్పటి వరకు మార్కెట్ చరిత్రలోనే పలకని గరిష్ఠ ధర క్వింటాకు రూ.2,821 పలికింది. హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం గూడూరు గ్రామానికి చెందిన చిలుముల మొగిలి 33 బస్తాల మొక్కజొన్నలను మార్కెట్‌కు అమ్మకానికి తీసుకువచ్చాడు. మాధవి ట్రేడర్స్ అడ్తీ ద్వారా ప్రేమ్ ఎంటర్‌ప్రైజెస్ నిర్వాహకులు క్వింటాకు రూ.2,821 చొప్పున ఖరీదు చేశారు. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతు చిలుముల మొగిలి మాట్లాడుతూ మార్కెట్‌లో మక్కలకు ఆశించిన ధర పలికినందుకు సంతోషంగా ఉందన్నారు. రైతులు ఆరుగాలం కష్టపడి పంట పండించినందుకు గిట్టుబాటు ధర పలికితే యువకులందరు ఉద్యోగాల కోసం పరుగులు తీయాల్సిన అవసరం లేదన్నారు. ఎవరి భూమిలో వారు వ్యవసాయం చేసుకుంటే సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ కంటే ఎక్కువే సంపాదించవచ్చని అన్నారు.


సబ్‌స్టేషన్‌లను ప్రొటెక్షన్ టీమ్‌లు తనిఖీ చేయాలి

హనుమకొండ టౌన్, ఆగస్టు 22: ప్రొటెక్షన్ టీమ్‌లు నిత్యం సబ్‌స్టేషన్‌లను తనిఖీ చేస్తూ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి సూచించారు. ఎన్పీడీసీఎల్ పరిధిలోని అన్ని జిల్లాల ఎస్ఈలు, యంఆర్‌టీ, టెక్నికల్ డీఈలతో గురువారం హనుమకొండ నక్కలగుట్ట విద్యుత్‌భవన్ నుంచి సీఎండీ వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు.

ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ.. పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు ఫెయిల్ కాకుండా డబుల్ ఎర్తింగ్ ఉండాలని సూచించారు. సర్వీసులను డిజిటలైజేషన్ చేయాలని, అలాగే ట్రాన్స్‌ఫార్మర్ల మ్యాపింగ్ వేగవంతం చేయాలన్నారు. లోడ్ ఎక్కువ ఉన్న చోట కెపాసిటర్లను ఏర్పాటు చేయాలన్నారు. ఎస్పీఎం షెడ్లలో సిబ్బంది నైపుణ్యత పెంచడానికి శిక్షణ తరగతులను నిర్వహించాలని ఆదేశించారు. ఆ కార్యక్రమంలో ఇన్‌చార్జి డైరెక్టర్స్ అశోక్‌కుమార్, మధుసూదన్, సీజీఎంలు, జీఎంలు పాల్గొన్నారు.

నిబంధనలు విస్మరించి అడ్డగోలు రిజిస్ట్రేషన్లు

ఆలస్యంగా వెలుగులోకి ఇద్దరు సబ్ రిజిస్ట్రార్‌ల బాగోతం



రాంనగర్, ఆగస్టు 22: ప్రభుత్వం ఎన్ని నిబంధనలు పెట్టినా రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో జరిగే అక్రమాలను అడ్డుకోవడం సాధ్యం కాదనే ఆరోపణలున్నాయి. ఆస్తుల రిజిస్ట్రేషన్‌ల విషయంలో జరుగుతున్న అక్రమాలను అరికట్టేందుకు గత ప్రభుత్వం ఒక సర్క్యులర్‌ను జారీ చేసింది. నాన్ లేఅవుట్ ప్లాట్లు, పార్ట్, అనుమతులు లేని ఇళ్ల రిజిస్ట్రేషన్‌లు చేయకూడదనే నిబంధనలు పొందుపరిచింది. ఈ నిబంధనలను బుట్టదాఖలు చేసిన పలువురు సబ్ రిజిస్ట్రార్‌లు విచ్చలవిడిగా రిజిస్ట్రేషన్‌లు చేసిన విషయం తెలిసిందే. నిబంధనలు విస్మరించి రిజిస్ట్రేషన్‌లు చేసేందుకు డబ్బులు దండుకుంటూ మహబూబాబాద్, పరకాల సబ్ రిజిస్ట్రార్‌లు ఏసీబీకి అడ్డంగా దొరికిన సంఘటనలు సైతం ఉన్నాయి.

కాగా, ఈ సంఘటనలు జరుగుతుండగానే ఖిలా వరంగల్, వరంగల్ రూరల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో నిబంధనలు విస్మరించి పలు రిజిస్ట్రేషన్‌లు చేసి అందినంత దండుకున్న ఇద్దరు సబ్ రిజిస్ట్రార్‌ల బాగోతం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇటీవల జరిగిన బదిలీల్లో పొరుగు జిల్లాలకు బదిలీ అయిన ఇద్దరు సబ్‌రిజిస్ట్రార్‌లు పదుల సంఖ్యలో నాన్ లేఅవుట్ ప్లాట్ల రిజిస్ట్రేషన్‌లు చేసినట్లు తెలిసింది. ఖిలావరంగల్ సబ్‌రిజిస్ట్రార్ పరిధిలోని బొల్లికుంటలో వెలిసిన ఒక నాన్ లేఅవుట్ వెంచర్‌కు సంబంధించిన 40కి పైగా రిజిస్ట్రేషన్‌లు కిందటేడు నెలాఖరున జరిగినట్లు తెలిసింది. ఈ రిజిస్ట్రేషన్‌లు ఒకే రోజున జరిగినవి కాగా, మిగతా రోజుల్లో చాలానే జరిగినట్లు సమాచారం. సదరు సబ్ రిజిస్ట్రార్ గజానికి రూ.200 చొప్పున డబ్బులు దండుకుని నాన్ లేఅవుట్ ప్లాట్ల రిజిస్ట్రేషన్‌లు చేసినట్లు తెలిసింది. ఇక వరంగల్ రూరల్ సబ్ రిజిస్ట్రార్ గొర్రెకుంటకు చెందిన నాన్ లేఅవుట్ 30కి పైగా ప్లాట్ల రిజిస్ట్రేషన్‌లు చేసినట్లు సమాచారం. మూడు మాసాల్లో ఈ రిజిస్ట్రేషన్‌లు జరిగినట్లు తెలిసింది. ఈ రిజిస్ట్రేషన్‌లకు సైతం సదరు సబ్ రిజిస్ట్రార్ గజాల లెక్కన వసూలు చేసినట్లు సమాచారం. ఈ ఇద్దరు వసూలు చేసిన మొత్తం లక్షల్లో ఉంటుందనే ప్రచారం సాగుతోంది. వీరిద్దరు ప్రస్తుతం పొరుగు జిల్లాల్లో విధులు నిర్వహిస్తున్నట్లు సమాచారం. బదిలీపై వెళ్లిన ఇద్దరు అధికారులపై గతంలో సైతం పలు ఆరోపణలున్నాయి. మొత్తంగా జిల్లాను వీడిన వీరి బాగోతంపై ఉన్నతాధికారులు ఏ మేరకు స్పందిస్తారో వేచి చూడాల్సిందే.



గవర్నర్ పర్యటనను విజయవంతం చేయాలి : కలెక్టర్

వరంగల్ కలెక్టరేట్, ఆగస్టు 22: ఈనెల 28న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ జిల్లా పర్యటనకు రానున్నందున విజయవంతం చేసేందుకు అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ సత్యశారద అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో గవర్నర్ పర్యటన ఏర్పాట్లపై గురువారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా అధికారులకు కేటాయించిన విధులను అత్యంత జాగ్రత్తగా, నిబద్ధతతో నిర్వర్తించాలన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురాలన్నారు. ఏర్పాట్లలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా చూడాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యశారద

అకడమిక్ ప్లానింగ్‌ను అమలు చేయాలి



కాశిబుగ్గలోని వివేకానంద కళాశాలలో డీఐఈవోను సన్మానిస్తున్న అధ్యాపకులు

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 22: జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు ఇంటర్మీడియట్ కళాశాలల్లో అకడమిక్ ప్లానింగ్‌ను పక్కాగా అమలు చేయాలని డీఐఈవో డాక్టర్ జి.శ్రీధర్‌సుమన్ అన్నారు. గురువారం ఆయన వరంగల్ నగరంలోని పలు ప్రభుత్వ, ఎయిడెడ్ కళాశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు బోర్డు నిర్దేశించిన నిబంధనల మేరకు విధులు నిర్వర్తించాలన్నారు. అధ్యాపకులు తమ బోధన పద్ధతులను మార్చుకొని విద్యార్థులను తీర్చిదిద్దడానికి కృషి చేయాలన్నారు. ఆంధ్రబాలిక, వివేకానంద తదితర ఎయిడెడ్ జూనియర్ కళాశాలలను సందర్శించి రికార్డులను, బోధన పద్ధతులను పరిశీలించారు. ఈ సందర్భంగా వివేకానంద కళాశాలలో ఆయనను అధ్యాపకులు సన్మానించారు.

త్వరలో జర్నలిస్టులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు

▸▸ మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు

పోచమ్మమైదాన్, ఆగస్టు 22: వరంగల్ తూర్పు నియోజకవర్గంలో అర్హులైన జర్నలిస్టులకు త్వరలో డబుల్ బెడ్‌రూం ఇళ్లు అందించనున్నట్లు మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు తెలిపారు. గ్రేటర్ వరంగల్ నగరంలోని 22వ డివిజన్‌లో గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా కొండా మురళీధర్‌రావు మట్లాడుతూ దేశాయిపేటలోని డబుల్ బెడ్‌రూం ఇళ్లను సందర్శించాల్సి ఉండగా... జర్నలిస్టు తిరుపతిరెడ్డి మృతితో ఆకస్మికంగా వాయిదా వేయాల్సిన పరిస్థితి తలెత్తినట్లు తెలిపారు. జర్నలిస్టు భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించినట్లు చెప్పారు. రాష్ట్ర మంత్రి కొండా సురేఖ నేతృత్వంలో అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్లు మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు బస్వరాజు కుమారస్వామి, ఫుర్ఖాన్, వస్కుల బాబు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

18వ డివిజన్‌లో రోడ్డు మరమ్మతులు



లేబర్‌కాలనీ, గాంధీనగర్‌కు వెళ్లే రోడ్డును మరమ్మతు చేస్తున్న దృశ్యం

ఖిలావరంగల్, ఆగస్టు 22: నగరంలోని లేబర్‌కాలనీ, గాంధీనగర్‌కు వెళ్లే రోడ్డు ప్రమాదకరంగా ఉండడంతో నగర పాలక సంస్థ ఏఈ కృష్ణమూర్తి మరమ్మతు పనులను చేయించారు. 18వ డివిజన్ లేబర్‌కాలనీ, గాంధీనగర్‌కు వెళ్లే దారి దుస్థితిపై ఇటీవల ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితం కావడంతో అధికారులు స్పందించారు. కార్పొరేటర్ ఇటీవల మంత్రి కొండా సురేఖ, కమిషనర్, అధికారులను కలిసి వినతిపత్రాలు ఇచ్చారన్నారు. అందుకు స్పందించిన నగరపాలక సంస్థ అధికారులు 18వ డివిజన్‌లో సీసీ రోడ్డును పోశారు. దీంతో వాహనదారులు, ప్రజలు 'ఆంధ్రజ్యోతి'కి కృతజ్ఞతలు తెలిపారు.

రైతులందరికీ రుణమాఫీ చేయాలి

▸▸ రైతు వ్యతిరేక ప్రభుత్వంపై ఉద్యమించాలి

▸▸ మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్

▸▸ వరంగల్‌లో బీఆర్ఎస్ నేతల ధర్నా

గిర్మాజిపేట, ఆగస్టు 22: రైతులందరికీ రుణమాఫీ చేయాల్సిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కుంటిసాకులతో మెజారిటీ రైతులకు మాఫీ చేయకుండా అబద్దాలు ప్రచారం చేస్తున్నదని మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ ఆరోపించారు. రుణమాఫీ అడిగిన రైతులపై కేసులు పెడుతూ ఇబ్బందులకు గురిచేస్తున్న రైతు వ్యతిరేక కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతులు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. రైతులందరికీ రుణమాఫీ చేయని ప్రభుత్వం తీరును నిరసిస్తూ బీఆర్ఎస్ రాష్ట్ర వ్యాప్త ఆందోళనల్లో భాగంగా గురువారం వరంగల్‌లోని హెడ్‌పోస్టాఫీసు సెంటర్‌లో మాజీ ఎమ్మెల్యే నరేందర్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. పార్టీ కార్పొరేటర్లు, స్థానిక నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్ ఆందోళన చేశారు.

ఈసందర్భంగా నన్నపునేని నరేందర్ మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా రాష్ట్రంలోని రైతులందరికీ రూ.40వేల కోట్లు రుణమాఫీ చేస్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టాక విస్మరించిందని విమర్శించారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీ 17వేల 900 కోట్ల రూపాయలు అయితే ఇప్పటి వరకు రైతులకు చేరింది రూ.7500 కోట్లు అని వివరించారు. రుణమాఫీపై రాష్ట్ర ప్రభుత్వానికి స్పష్టత లేదనే విషయం లెక్కల్లోనే తెలుస్తున్నదని ఆయన ఎద్దేవా చేశారు. రైతుల ప్రభుత్వం అంటూ గొప్పగా ప్రచారం చేసుకుంటున్న రేవంత్‌రెడ్డి రైతుల పొట్టలు కొట్టి సంబురాలు చేసుకునే రైతు వ్యతిరేక ప్రభుత్వమని మండిపడ్డారు. గత ఎన్నికల్లో హామీ ఇచ్చిన మేరకు రైతులందరికీ ఆంక్షలు లేకుండా రుణమాఫీ చేయాలని, లేని పక్షంలో రుణమాఫీ చేసేవరకు బీఆర్ఎస్ రైతు ఉద్యమాన్ని చేపడుతుందని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ముందుగా తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేసిన అనంతరం నరేందర్ ధర్నాలో కూర్చున్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు దిడ్డి కుమారస్వామి, మరుపల్లి రవి, సిద్ధం రాజు, మాజీ కార్పొరేటర్లు టి.రమేష్‌బాబు, కుందారపు రాజేందర్, వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని డివిజన్ల పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వరంగల్ హెడ్‌పోస్టాఫీసు సెంటర్‌లో ధర్నా చేస్తున్న మాజీ ఎమ్మెల్యే నరేందర్

ధర్నాపై వాహనదారుల అసహనం..

వరంగల్ హెడ్‌పోస్టాఫీసు సెంటర్‌లో బీఆర్ఎస్ ధర్నాపై వాహనదారులు, పాదాచారులు అసహనం వ్యక్తం చేశారు. హెడ్‌పోస్టాఫీసు సెంటర్ నాలుగు వైపులా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు మెయిన్ రోడ్డుపై ధర్నాలో బైఠాయించడంతో ట్రాఫిక్ స్తంభించిపోయింది. ధర్నా అర్థగంటకు పైగా సాగడంతో బీఆర్ఎస్ శ్రేణులను పక్కకు జరుపుకుంటూ వెళ్లేందుకు వాహనదారులు ప్రయత్నించగా వాగ్వాదానికి దిగారు. దీంతో పోలీసులు మాజీ ఎమ్మెల్యేను ధర్నా విరమించాలని కోరారు. అలాగే ధర్నాపై అసహనం వ్యక్తం చేసిన వాహనదారులకు మాజీ ఎమ్మెల్యే నరేందర్ సర్ది చెప్పి సహకరించాలని కోరారు.

కమిషనరేట్‌లో ఏడుగురు ఎస్ఐల బదిలీ

వరంగల్ క్రైం, ఆగస్టు 22: వరంగల్ కమిషనరేట్ పరిధిలో ఏడుగురు ఎస్ఐలను బదిలీ చేస్తూ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. జి.రాజేష్ రెడ్డి వీఆర్ నుంచి నర్సంపేటకు, జె.పరమేశ్వర్ వీఆర్ నుంచి ఆత్మకూరుకు, కె.అశోక్‌కుమార్ వీఆర్ నుంచి హనుమకొండకు, పి.తిరుపతి వీఆర్ నుంచి నర్సంపేటకు, డి.నిహారిక సీఎస్‌బీ నుంచి పీసీఆర్‌కు, ఎం.రాజు సీసీఎస్ నుంచి కేయూసీకి, ఎస్.రవి సీసీఎస్ నుంచి హసన్‌పర్తి పీఎస్‌కు బదిలీ అయ్యారు.

అస్తవ్యస్తం!

(5వ పేజీ తరువాయి)

లక్ష్యంగా శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులతో ఆన్‌లైన్ క్లాసులు ప్రతీ మంగళవారం, శుక్రవారం జరుగుతున్నాయి. మండల కేంద్రాలలోని రైతు వేదికలు మినహా మిగితా రైతు వేదికల్లో ఏఈవోల ఆధ్వర్యంలో రైతు రుణమాఫీ తదితర వ్యవసాయ సాగు సంబంధించిన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఏఈవోలే వాటి నిర్వహణ భారాన్ని మీద వేసుకుని నడిపిస్తున్నారు.

ప్రభుత్వానికి నివేదిస్తున్నాం..

డీఏవో ఉషాదయాల్

రైతు వేదికల నిర్వహణకు సంబంధించిన నిధుల విషయమై ప్రతీ నెల ప్రభుత్వా నికి నివేదికలు పంపిస్తున్నాం. త్వరలోనే ప్రభుత్వం నిధులు విడుదల చేసే అవకాశం ఉంది. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం.

బీఆర్ఎస్ పార్టీకి భారీ షాక్

▸▸ కార్పొరేటర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరిన ఉద్యమకారులు



కొండా సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన పలువురు ఉద్యమకారులు

కరీమాబాద్, ఆగస్టు 22: వరంగల్ అండర్ రైల్వేగేటు ప్రాంతం 32వ డివిజన్‌లో బీఆర్ఎస్ పార్టీకి భారీ షాక్ తగలింది. ఆ డివిజన్ కార్పొరేటర్ పల్లం పద్మ రవి ఆధ్వర్యంలో పలువురు ఉద్యమకారులు గురువారం కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఓ సిటీలోని క్యాంపు కార్యాలయంలో మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు, కాంగ్రెస్ నాయకుడు నవీన్‌రాజ్ కండువాలు కప్పి ఉద్యమకారులను పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో కొండ రాజు, కొండ సుధాకర్, నీలం వినీత్, మల్కా సతీష్ కిషవనేని నటరాజ్, ప్రభుసాగర్, నాంపల్లి రజిత, వనం రమ, వావిలాల సతీష్, ఆమంచ సతీష్ ఉన్నారు. ఈ సందర్భంగా కొండా మురళీధర్‌రావు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను, నాయకులను కంటికి రెప్పలా కాపాడుకుంటానని, తగిన గుర్తింపు ఇచ్చి అన్ని విధాలా అవకాశాలను కల్పిస్తానని అన్నారు. కార్పొరేటర్ పల్లం పద్మరవి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి నాయకులు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో డివిజన్ ప్రెసిడెంట్ సందీప్, కాంగ్రెస్ నాయకులు బత్తిని రంజిత్, కస్తూరి వంశీ, బండి భాస్కర్, పోతు తిరుపతి, రాపల్లి రవి, డివిజన్ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో ముదిరాజ్‌లు సత్తా చాటాలి

గీసుగొండ, ఆగస్టు 22: పార్టీలు వేరైనా రానున్న స్థానిక ఎన్నికల్లో అంతా ఒక్కటై ముదిరాజ్ అభ్యర్థులను గెలిపించుకొని తమ సత్తాను చాటాలని ఆ సంఘం రాష్ట్ర వ్యవస్థాపకుడు పులి దేవేందర్ పిలుపునిచ్చారు. మండలంలోని కొమ్మాలలో ముదిరాజ్ ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్(మెపా) సమావేశం ఎంబాడి రాము అధ్యక్షతన గురువారం జరిగింది. రాష్ట్ర కార్యదర్శి నీరటి రాజు, కొమ్మాలు, విజయ్, సంపత్ పాల్గొన్నారు.

మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలు

ఖిలావరంగల్, ఆగస్టు 22: ప్రజలందరి అభిమాన నటుడు, మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలను అఖిల భారత చిరంజీవి అభిమాన సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కరాటే ప్రభాకర్ ఘనంగా నిర్వహించారు. గురువారం 34వ డివిజన్ శివనగర్‌లో భారీ కేక్‌ను కట్ చేసి స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. అనంతరం శివనగర్, భూపేష్‌నగర్‌లో మొక్కలు నాటారు. కార్యక్రమంలో మెగాస్టార్ చిరంజీవిఅభిమానులు, ప్రజలు,పసి, రాము, రమేష్, రావుల రాజేష్, రతన్,రవి, లక్ష్మణ్,చిరంజీవి పాల్గొన్నారు.



కేక్ తినిపిస్తున్న కరాటే ప్రభాకర్

జానపద కళాకారులను ప్రభుత్వం గుర్తించాలి

సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింహ



శివనగర్ తమ్మెర భవన్‌లో మాట్లాడుతున్న పల్లె నర్సింహ

ఖిలావరంగల్, ఆగస్టు 22: జానపద కళాకారులను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించాలని జానపద ప్రజానాట్య మండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నర్సింహ అన్నారు. గురువారం శివనగర్‌లోని తమ్మెర భవన్‌లో ప్రజానాట్య మండలి ప్రపంచ జానపద దినోత్సవం సందర్భంగా వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జానపద కళాకారులకు నంది అవార్డులు ఇవ్వాలన్నారు. జానపద కళాకారులను గుర్తించి గుర్తింపు కార్డులు, హెల్త్ కార్డులు ఇవ్వాలన్నారు. ప్రస్తుతం సమాజంలో అంతరించిపోతున్న ప్రజాకళలను, ప్రజా సాహిత్యాన్ని, జానపద, పౌరాణిక, యక్షగానం, ఒగ్గుకథ, కోలాటం, ఒగ్గుడోలు, చిరుతల రామాయణం, గుస్సాడి, మధుర, ఆదివాసీ, గిరిజన సంస్కృతిని కాపాడుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు కన్నం లక్ష్మీనారాయణ, కేతరాజు ఉప్పలయ్య, రేగుంట చంద్రశేఖర్, జిల్లా ప్రధాన కార్యదర్శి దామెర కృష్ణ, గౌరవ అధ్యక్షుడు గన్నారపు రమేష్ జిల్లా ఉపాధ్యక్షుడు సుప్రియ, అముడల సుమలత తదితరులు పాల్గొన్నారు.

అండర్ రైల్వేగేట్‌లో మురుగు బ్రిడ్జిలు

▸▸ రూ.12కోట్లు వెచ్చించినా ప్రజలకు తిప్పలే

▸▸ మురుగు, డ్రెయినేజీ నీటిలో నుంచి రాకపోకలు



అండర్‌బ్రిడ్జి వద్ద నిలిచిన మురుగు, డ్రెయినేజీ నీరు



శాకరాశికుంట చిన్నబ్రిడ్జి వద్ద నిలిచిన వర్షం నీరు

ఖిలావరంగల్, ఆగస్టు 22: అనేక దశాబ్దాలుగా వరంగల్ అండర్ రైల్వేగేట్ ప్రాంత ప్రజల కష్టాలు తీరడం లేదు. వరంగల్ అండర్‌బ్రిడ్జి ప్రాంత ప్రజలు ప్రతిరోజు వరంగల్, హనుమకొండ తదితర ప్రాంతాలకు అండర్‌బ్రిడ్జి, సాకరాశికుంటలోని చిన్న బ్రిడ్జిలో నిలిచి ఉన్న మురుగు, డ్రెయినేజీ నీటిలో నుంచి వెళ్లాల్సిందే. పదేళ్ల క్రితం టీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో ఎమ్మెల్యే, నగరపాలక సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో రూ.9కోట్లతో అప్పటి మంత్రి హరీష్‌రావు, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు, ప్రస్తుత మంత్రి కొండా సురేఖ చేతుల మీదుగా అండర్‌బ్రిడ్జి మరమ్మతు, తదితర పనులకు శంకుస్థాపన చేశారు. అండర్‌బ్రిడ్జి గుండా వెళ్లే బాటసారులపై మలమూత్రాలు పడకుండా రైల్వేట్రాక్ కింద స్లాబ్ వేశారు. అలాగే అండర్‌బ్రిడ్జికి ఇరువైపులా పిల్లర్లతో గోడలను నిర్మించారు. కాగా, అభివృద్ధి పనులు కాస్త ఆలస్యం కావడంతో తర్వాత వచ్చిన వరంగల్ తూర్పు మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ హయాంలో ఇరుకుగా మారిన అండర్‌బ్రిడ్జికి సమానంగా మరో వెంట్(దారి)ని, సీసీ రోడ్డు తదితర పనులను రూ.12కోట్లతో పూర్తిచేశారు. అలాగే కాజీపేట నుంచి విజయవాడ వరకు నిర్మిస్తున్న రైల్వే మూడవ లైన్‌లో భాగంగా సాకరాశికుంట, మినీ అండర్‌బ్రిడ్జి (చిన్నబ్రిడ్జి)ని వెడల్పులో భాగంగా గత సంవత్సరం పనులను చేపట్టారు. వరంగల్ అండర్‌బ్రిడ్జి(చిన్నబ్రిడ్జి) పనులు పూర్తయి ఏడాది కాకుండానే ప్రస్తుత వర్షాకాలంలో అండర్‌బ్రిడ్జి, మినీ అండర్‌బ్రిడ్జిల వద్ద మురుగు, డ్రెయినేజీ నీటితో పాటు వర్షం నీరు నిలిచి ఉండడంతో వాహనాలు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. భారీ వర్షాలు పడినప్పుడు అండర్‌బ్రిడ్జి నుంచి కొన్ని గంటలపాటు భారీ వాహనాలు, బస్సులు, లారీలు, కార్లు, ఆటోలు ద్విచక్ర వాహనాలతో పాటు పాదాచారుల రాకపోకలు బంద్ చేయాల్సివస్తుంది. కానీ, మినీ అండర్ బ్రిడ్జి వర్షం నీరు, డ్రెయినేజీ నీరు వారం, పది రోజులైనా నిలిచి ఉండడంతో కరీమాబాద్ గుండా వరంగల్, హనుమకొండ తదితర ప్రాంతాలకు రాక పోకలు బంద్ చేయాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి. కొందరు బాటసారులు చిన్నబ్రిడ్జి కట్టపైకి ఎక్కి రైలు పట్టాలు దాటి నడిచి వెళ్లే క్రమంలో రైలు ఢీకొని మృతి చెందిన సందర్భాలు సైతం ఉన్నాయి.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయ లోపం..

కేంద్ర ప్రభుత్వం ఆధీనంలో రైల్లు, రాష్ట్ర ప్రభుత్వం ఆధీనంలో రోడ్లు, డ్రెయియినేజీలు, పైప్‌లైన్ల ఏర్పాటు సంబంధిత శాఖాధికారుల సమన్వయ లోపంతో అండర్‌బ్రిడ్జి అభివృద్ధి పనులను రూ.12కోట్లతో పూర్తి చేశారు. అండర్‌బ్రిడ్జి మొదటి ద్వారం కింది నుంచి నగరపాలక సంస్థ పైప్‌లైన్ ఉంది. దానిని మార్చకుండా దానిపై నుంచి సీసీ రోడ్డు వేయడం వలన పైప్‌లైన్ పగిలి సీసీ రోడ్డు కింది నుంచి తాగునీరు రోడ్డు పైకి వచ్చి అండర్‌బ్రిడ్జి పూర్తిగా జలమయం అవుతుంది. దీనికి తోడు డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారడంతో అండర్‌బ్రిడ్జి మురుగు బ్రిడ్జిగా మారిందని ప్రజలు వాపోతున్నారు.

సఖి సేవలపై అవగాహన

సంగెం, ఆగస్టు 22: మండలంలోని బాలునాయక్‌తండాలో గ్రామైఖ్య సంఘాల సభ్యులకు వరంగల్ సఖి సెంటర్ నిర్వాహకులు గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కేస్‌వర్కర్ స్వప్న మాట్లాడుతూ మహిళలు, బాలికల రక్షణ, భద్రతకుగాను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సఖి కేంద్రాలను నిర్వహిస్తున్నాయన్నారు. బాధిత మహిళలకు కౌన్సిలింగ్, పోలీసు, న్యాయ, వైద్య సహాయం, తాత్కాలిక వసతి వంటి సేవలను ఉచితంగా 24 గంటలు అందుబాటులో ఉంటూ అందిస్తున్నామని తెలిపారు. మహిళల హెల్ప్‌లైన్ 181కు కాల్ చేసినట్లయితే రెస్క్యూ చేయడం జరుగుతుందన్నారు. అనంతరం పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్‌వైవో కోఆర్డినేటర్ ఇందిర, అంగన్‌వాడీ టీచర్ విజయ, ఆశ వర్కర్ లలిత, వీవోఏ సుజాత పాల్గొన్నారు.

స.హ చట్టం పరిరక్షణ కమిటీ జిల్లా మహిళా కన్వీనర్‌గా విజయలత

వరంగల్ చౌరస్తా, ఆగస్టు 22: సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు జంగిటి శ్రీనివాస్ ఆదేశానుసారం రాష్ట్ర అధ్యక్షుడు ఎలిగేండ్ల వెంకటేష్ ఆధ్వర్యంలో వరంగల్ జిల్లా మహిళా కన్వీనర్‌గా కోడి విజయలతను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సూర స్రవంతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా మహిళా కన్వీనర్‌గా నియమితులైన విజయలత మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం అనేది ప్రతీ పౌరుడికి ఒక ప్రాథమిక హక్కు అని, ప్రభుత్వ పాలనలో పారదర్శకత, అవినీతిని సమాచార హక్కు చట్టం ద్వారా వెలికితీస్తానని తెలిపారు. తన నియామకానికి సహకరించిన అందరికి కృతజ్ఞతలు తెలిపారు.

అంతర్జాతీయ కబడ్డీ పోటీలకు ధర్మారం విద్యార్థులు



హరీష్, కిశోర్‌లను అభినందిస్తున్న హెచ్‌ఎం

గీసుగొండ, ఆగస్టు 22: రూరల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి కబడ్డీ పోటీల్లో ధర్మారం జడ్పీ పాఠశాలలో చదువుతున్న ఓర్సు హరీష్, శివరాత్రి కిశోర్ అత్యంత ప్రతిభ కనబరిచి అంతర్జాతీయ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం సాంబయ్య తెలిపారు. గోవాలో నిర్వహించిన జాతీయ స్థాయి పోటీల్లో హరీష్ తెలంగాణ రాష్ట్ర జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించారు. ఈ నెల 27 నుంచి నేపాల్‌లో జరిగే అంతర్జాతీయ పోటీల్లో హరీష్, కిశోర్ పాల్గొంటారని హెచ్‌ఎం చెప్పారు. కాగా, కబడ్డీలో ప్రతిభ కనబరిచిన హరీష్, కిశోర్‌లను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, యాప్ కమిటీ సభ్యులు గురువారం అభినందించారు.

లీగల్ సెల్ చైర్మన్ శ్రీనివాస్‌కు సన్మానం



శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న విజయరాంచందర్

ఖిలావరంగల్, ఆగస్టు 22 : కాంగ్రెస్ పార్టీ వరంగల్ జిల్లా లీగల్ సెల్ చైర్మన్‌గా నియమితులైన న్యాయవాది శామంతుల శ్రీనివాస్‌ను కాంగ్రెస్ 34వ డివిజన్ మహిళా అధ్యక్షురాలు రావుల విజయరాంచందర్ ఘనంగా సన్మానించారు. గురువారం శివనగర్‌లోని ఆయన నివాసంలో శ్రీనివాస్ దంపతులను శాలువా, బొకేతో సన్మానించి స్వీట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా, నగర, డివిజన్ ప్రాంతంలోని సమస్యలను ప్రభుత్వం, అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో 34వ డివిజన్ మాజీ కార్పొరేటర్ శామంతుల ఉషశ్రీ, కాంగ్రెస్ నాయకులు పట్టూరి సుధాకర్, రాధిక, ముత్తినేని మధు, విజయ్, రాజేష్, వెంకన్న, శ్రీధర్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

రైతులను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం

▸▸ మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి



ధర్నాలో మాట్లాడుతున్న ధర్మారెడ్డి

గీసుగొండ, ఆగస్టు 22: రైతుల రుణమాఫీకి రూ.31వేల కోట్లు ఖర్చు అవుతుందని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం రూ.17వేల కోట్లను మాత్రమే రైతులకు రుణమాఫీ చేసి మోసం చేసిందని మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఆరోపించారు. బీఆర్ఎస్ రాష్ట్ర పార్టీ రుణంపై రణం పేరుతో ఇచ్చిన పిలుపు మేరకు ఊకల్ క్రాస్‌రోడ్డు వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి ఆంక్షలు లేకుండా అర్హులందరికీ రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తెలంగాణ తల్లి ఫ్లెక్సీకి ఆయన క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో వరంగల్ మార్కెట్ మాజీ చైర్మన్ చింతం సదానందం, మాజీ జడ్పీటీసీ పోలీస్ ధర్మారావు, మాజీ సర్పంచ్‌లు పుండ్రు జయపాల్‌రెడ్డి, బోడకుంట్ల ప్రకాష్, అంకతి నాగేశ్వర్‌రావు, జక్కు మురళి, మార్కెట్ మాజీ డైరెక్టర్ గోలి రాజయ్య, నాయకులు జూలూరి కేదారి, లెనిన్, మోహన్‌రెడ్డి, లడే సంతోష్, సిరిసె శ్రీకాంత్, ధనుంజయ్, మోహన్, పసుల రాజేందర్, నాంపెల్లి సారంగం, జహీర్, రవీందర్‌రెడ్డి, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ మార్కెట్ ధరలు

పంట	క్వింటా గరిష్ఠ	క్వింటా కనిష్ఠ
మక్కలు	2,821	2,602
పల్లికాయ(పచ్చిది)	4,250	3,500
పల్లికాయ(సూక)	5,850	5,000
పత్తి	7,420	5,000
పసుపు(కాడి)	13,516	9,090
పసుపు(గోల)	13,116	12,044
తేజ మిర్చి	12,000	8,000
తేజ ఏసీ	18,500	9,000
వండర్‌హాట్ ఏసీ	15,000	12,000
యూఎస్341 ఏసీ	15,500	9,000
తాలు మిర్చి	6,000	3,000

రుణమాఫీపై బ్యాంకు మేనేజర్లతో మాజీ మంత్రి ఎర్రబెల్లి చర్చలు

వర్ధన్నపేట రూరల్, ఆగస్టు 22 : ఇటీవల రైతులకు జరుగుతున్న రుణమాఫీ పై మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆరా తీశారు. మండలంలోని ఇల్లందలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఏపీజీవీ బ్యాంకుల్లోకి గురువారం వెళ్లి రైతులకు జరుగుతున్న రుణమాఫీ తీరును మేనేజర్లతో మాట్లాడి తెలుసుకున్నారు. రైతులతో సైతం మాట్లాడి వారికి జరుగుతున్న మాఫీ, తిరిగి తీసుకుంటున్న రుణాల పద్ధతిపై మాట్లాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ రైతులను మోసం చేసి పబ్బం గడుపుతోందని, ఆరు గ్యారంటీలు, రుణమాఫీ పేరుతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి నమ్మకద్రోహం చేశారని ఆరోపించారు. రైతుల ఉసురు ప్రభుత్వానికి తప్పకుండా తాకుతుందని, మాజీ సీఎం కేసీఆర్ మాత్రమే రైతులకు ఎన్నో విధాలుగా పనిచేశారని తెలిపారు. మళ్లీ బీఆర్ఎస్ పార్టీ వచ్చాకే రైతులకు మంచి రోజులు వస్తాయని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు అంబటి ఎల్లస్వామి, పెంచికాల కుమారస్వామి, బేతి సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

గిరిజన సంప్రదాయాలకు ప్రతీక తీజ్



భద్రుతండాలో తీజ్ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మాధవరెడ్డి

ఖానాపురం, ఆగస్టు 22 : మండలంలోని భద్రుతండాలో నిర్వహించిన తీజ్ పండుగ వేడుకల్లో ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి గురువారం పాల్గొన్నారు. గిరిజనుల సాంస్కృతిక వైభవానికి ప్రతీక తీజ్ పండుగని అన్నారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యడ్ల జగన్మోహన్‌రెడ్డి, మండలపార్టీ అధ్యక్షుడు శాఖమూరి హరిబాబు, మాజీ ఎంపీటీసీ పూల్‌సింగ్, మంగళవారిపేట గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బొమ్మగాని నవీన్, ముస్తఫా, సాగర్‌రావు, పల్నాటి శ్రీను పాల్గొన్నారు.

● చెన్నారావుపేట: మండలంలోని అక్కల్‌చెడ గ్రామ తండాలో నిర్వహించిన తీజ్ పండుగ వేడుకల్లో ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనువాస్, మండల పార్టీ అధ్యక్షుడు భూక్య గోపాల్‌నాయక్, గ్రామ పార్టీ అధ్యక్షుడు ఫులిచేరు రాజేందర్, నర్సంపేట మండల పార్టీ ఉపాధ్యక్షుడు గజ్జి రాజు, జిల్లా కార్యదర్శి మొగిలి వెంకట్‌రెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్దెన రమేష్, యూత్ అధ్యక్షుడు బండి హరీష్, నెక్కొండ బ్లాక్ కార్యదర్శి మంద యాకయ్యగౌడ్, మండల నాయకుడు కుండె కుమారస్వామి పాల్గొన్నారు.

● నల్లబెల్లి: మండలంలోని బజ్జు తండా జీపీ పరిధిలోని చిన్న తండాలో తీజ్ వేడుకల్లో ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో నాయకులు చిట్యాల తిరుపతిరెడ్డి, కడ్దూరి కట్టయ్య, గాదె కరుణాకర్, చిన్న తండా యువకులు, మహిళలు పాల్గొన్నారు.

కాలువ ఆక్రమణపై మునిసిపల్ ఏఈకి ఫిర్యాదు



మునిసిపల్ ఏఈకి వినతి పత్రం అందజేస్తున్న కౌన్సిలర్ శ్రీదేవి

నర్సంపేట టౌన్, ఆగస్టు 22 : నర్సంపేట పట్టణ పరిధి ద్వారకపేటలోని ఎంఏఆర్ ఫంక్షన్ ముందు నుంచి వెళ్లే పంట కాలువను ఆక్రమించుకున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ 6వ వార్డు కౌన్సిలర్ శ్రీదేవి గురువారం మునిసిపల్ ఏఈ రాజేష్‌కు ఫిర్యాదు చేశారు. కౌన్సిలర్ మాట్లాడుతూ ఎంఏఆర్ పక్కన మోతె సంపత్‌రెడ్డి అనే వ్యక్తి కాలువ అవతల నిర్మించిన షాపులోకివెళ్లడానికి పంట కాలువలో పెద్ద పెద్ద పైపులు వేసి దారి ఏర్పాటు చేసుకున్నాడన్నారు. దీంతో పంట పొలాలకు కాలువనీరు సక్రమంగా ప్రవహించడంలేదన్నారు. వర్షాలు పడిన సమయంలో పైపులు అడ్డుగా ఉండడం వల్ల కాలువ నీరంతా రోడ్డుపై పారుతుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా పైపులను తొలగించి సంపత్‌రెడ్డిపై చర్యలుతీసుకోవాలని, కాలువస్థలాన్ని పరిరక్షించాలని అధికారులను కోరారు.

సఖి సేవలపై అవగాహన

సంగెం, ఆగస్టు 22 : మండలంలోని బాలునాయక్‌తండాలో గ్రామైక్య సంఘాల సభ్యులకు వరంగల్ సఖిసెంటర్ నిర్వాహకులు గురువారం అవగాహన కల్పించారు. కేస్‌వర్కర్ స్వప్న మాట్లాడుతూ మహిళలు, బాలికల రక్షణ, భద్రతకు గాను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సఖి కేంద్రాలను నిర్వహిస్తున్నాయన్నారు. మహిళల హెల్ప్‌లైన్ 181 నెంబరుకు కాల్ చేసినట్లయితే రెస్క్యూ చేయడం జరుగుతుందన్నారు. అనంతరం పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్‌వైవో కోఆర్డినేటర్ ఇందిర, అంగన్‌వాడీ టీచర్ విజయ, ఆశ వర్కర్ లలిత, వీవోఏ సుజాత పాల్గొన్నారు.

సర్కిల్ ఒకచోట.. కార్యాలయం మరోచోట!

పర్వతగిరి సర్కిల్ కార్యాలయం మామునూరులో ఏర్పాటు

ఇబ్బందులు పడుతున్న ప్రజలు

సర్కిల్ ఏర్పాటుచేసి లాభమేంటని ఆవేదన

పర్వతగిరి, ఆగస్టు 22 : వరంగల్ కలెక్టర్ కార్యాలయం హనుమకొండలో ఉన్నట్లు, పర్వతగిరి సర్కిల్ కార్యాలయం సర్కిల్‌కు సంబంధంలేని మామునూరులో ఉంది. పర్వతగిరి, ఐనవోలు, సంగెం మూడు మండలాలను కలిపి గతంలో పర్వతగిరి పోలీస్ సర్కిల్‌గా ఏర్పాటుచేశారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ఉండడంతో పాటు తమ ఫిర్యాదులు సత్వరమే పరిష్కారమవుతాయని ప్రజలు భావించారు. పర్వతగిరి సర్కిల్ కాకముందు ఇన్‌స్పెక్టర్ కోసం సర్కిల్ కార్యాలయమైన మామునూరుకు వెళ్లాలంటే అనేక వ్యయప్రయాసాల కోర్చాల్సి వచ్చేది. కానీ, పర్వతగిరిలోనే సర్కిల్ ఏర్పాటు చేసిన ప్రభుత్వం పర్వతగిరి స్టేషన్‌లోనే సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌కు కార్యాలయంకేటాయించింది. కానీ, ఇక్కడకు వచ్చిన సీఐలు తొలుత ఇక్కడినుంచే తమ కార్యకలాపాలను నిర్వహించినా కాలక్రమేణా మళ్లీ తమ కార్యాలయాన్ని మామునూరుకుమార్చారు.పరిస్థితి మళ్లీమొదటికొచ్చింది.

కార్యాలయం కోసం భవనం ఉన్నా...

పర్వతగిరి సర్కిల్ కార్యాలయం కోసం భవనం ఉన్నప్పటికీ ఇన్‌స్పెక్టర్లు మాత్రం ఇక్కడనుంచి తమ కార్యకలాపాలు కొనసాగించడానికి ఇష్టపడడంలేదు. వరంగల్ నగరానికి మామునూరు దగ్గరగా ఉండడంతోపాటు నగరంలోనే నివాసం ఉండే ఇన్‌స్పెక్టర్లు అక్కడ నుంచి రాకపోకలు సాగించడానికి గాను సులువుగా, అనువుగా ఉంటుందని మామునూరులోనే కార్యాలయాన్ని కొనసాగిస్తున్నారు. కాగా, సర్కిల్ కార్యాలయం సర్కిల్‌కు సంబంధంలేని ప్రదేశంలో ఉండడంతో అక్కడకు వెళ్లిరావడానికి గాను సర్కిల్ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పర్వతగిరి, ఐనవోలు, సంగెం మండలాలకు చెందిన సర్కిల్ కార్యాలయాన్ని ఆయా మండలాల్లో ఏర్పాటుచేయాల్సింది పోయి, సర్కిల్‌కు సంబంధం లేని మండలంలో ఏర్పాటుచేయడంతో పలువురు ఆగ్రహం, అసహనం వ్యక్తం చేస్తున్నారు.

దృష్టి సారించని ఉన్నతాధికారులు

ప్రజలను రక్షించే రక్షకభటులు ఎల్లప్పుడూ వారికి అందుబాటులో ఉండాలి. అందుకే వారిని తాము పని



పర్వతగిరి పోలీస్‌స్టేషన్

చేసే హెడ్‌క్వార్టర్స్‌లోనే నివాసముండాలనే నిబంధనలను పక్కాగా అమలుచేస్తారు. కానీ, పర్వతగిరి సర్కిల్ విషయంలో మాత్రం పోలీసు అధికారులు కొన్ని నిబంధనలను పక్కనపెట్టినట్టు కనిపిస్తోంది. హెడ్‌క్వార్టర్స్‌లో నివాసముండే సంగతి దేవుడెరుగు... అసలు కార్యాలయమే హెడ్‌క్వార్టర్స్‌లో లేకుండాపోయింది. వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలోకి వచ్చే పర్వతగిరి సర్కిల్‌కు పైస్థాయి అధికారులైన ఏసీపీ, డీసీపీ, సీపీ స్థాయి అధికారులు ఎంతో మంది వస్తున్నా, వారు సైతం పర్వతగిరి సర్కిల్ కార్యాలయంపై దృష్టిసారించకపోవడం శోచనీయం. గత ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న పర్వతగిరి వాస్తవ్యుడైన ఎర్రబెల్లి దయాకర్‌రావు సైతం ఈ విషయాన్ని పెద్దగా పట్టించుకోలేదు. సర్కిల్ కార్యాలయం పట్ల అటు అధికారులకు గానీ, ఇటు ప్రజాప్రతినిధులకు గానీ ఎందుకింత చిన్నచూపో అర్థం కావడం లేదు. పోలీసు కమిషనర్‌గా సేవలందించిన ప్రస్తుత వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు ఈ విషయంపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

కమిషనరేట్‌కు ఫిర్యాదుల వెల్లువ

సాధారణంగా పోలీసుస్టేషన్‌లో సబ్ ఇన్‌స్పెక్టర్‌కు బాధితులు ఫిర్యాదులు అందిస్తారు. అక్కడ తమకు న్యాయం జరగలేదంటే సర్కిల్ కార్యాలయంలో ఇన్‌స్పెక్టర్‌కు అందిస్తారు. కానీ, ఇక్కడ సర్కిల్ కార్యాలయం లేకపోవడంతో బాధితులు నేరుగా పోలీస్ కమిషనరేట్ కార్యాలయానికే వెళ్లి తమ ఫిర్యాదులను అందిస్తున్నారు. గత ఐదారునెలలుగా పర్వతగిరి మండలంతో పాటు సర్కిల్ నుంచి పోలీసు కమిషనరేట్‌కు ఫిర్యాదులు పెరిగాయని విశ్వసనీయ వర్గాల సమాచారం. సర్కిల్ కార్యాలయం పర్వతగిరిలో ఏర్పాటుచేస్తే కమిషనరేట్‌పై ఫిర్యాదుల భారం తగ్గుతుందని పలువురు అధికారులు చెపుతున్నారు. ఇప్పటికైనా పర్వతగిరి సర్కిల్ కార్యాలయం పర్వతగిరిలో ఏర్పాటుచేయడంపై ఏకంగా పోలీస్‌బాసే దృష్టిసారించాలని స్థానికులు కోరుతున్నారు.

రైతులను దగా చేసిన కాంగ్రెస్ సర్కార్



రాయపర్తిలో ఆందోళన చేస్తున్న మాజీ మంత్రి దయాకర్‌రావు, ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డి

వర్ధన్నపేట, ఆగస్టు 22 : మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ చేయకుండా రైతాంగాన్ని మోసం చేసిందని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డిలు ధ్వజమెత్తారు. వర్ధన్నపేట మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన ధర్నాను పురస్కరించుకొని తెలంగాణ తల్లి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆగస్టు 15లోపు రూ.2 లక్షల రుణ మాఫీ చేస్తానని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పిన మాటలు మోసపూరితమైనవని దుయ్యబట్టారు. రుణమాఫీ వర్తించక రాష్ట్రంలో వేలాది మంది రైతులు బ్యాంకుల చుట్టూ, సొసైటీల చుట్టూ తిరుగుతున్నారని వారి ఉసురు సీఎం రేవంత్‌రెడ్డికే తగులుతుందని విమర్శించారు. ఆగస్టు 15లోపు రుణ మాఫీ చేస్తానని మాట తప్పిన సీఎం రేవంత్‌రెడ్డి తన పదవీకి రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో బీఆర్ఎస్ రాష్ట్ర, జిల్లా నేతలు వాసుదేవ రెడ్డి, లలితయాదవ్, మార్గం భిక్షపతి, కె.వీరేందర్‌రెడ్డి, తూళ్ల కుమారస్వామి, సంపత్‌రెడ్డి, సిలువేరు కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

● రాయపర్తి: కాంగ్రెస్ పార్టీ రైతులను దగా చేసిన ప్రభుత్వమని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డిలు ఆరోపించారు. మండల కేంద్రంలోని వరంగల్ ఖమ్మం జాతీయ రహదారిపై ధర్నా నిర్వహించి, తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేసి వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో మాజీ వికలాంగుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు వాసుదేవరెడ్డి, డీసీసీబీ మాజీ డైరెక్టర్ బిల్లా సుధీర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ జీనుగు అనిమిరెడ్డి, మాజీ జడ్పీటీసీ రంగు కుమార్, పూస మధు, తాళ్లపెల్లి సంతోష్, మధు, నర్సయ్య, రాజబాబు పాల్గొన్నారు.

● గీసుగొండ : రైతుల రుణమాఫీకి రూ.31వేల కోట్లు ఖర్చు అవుతుందని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం రూ.17వేల కోట్లను మాత్రమే రైతులకు రుణమాఫీ చేసి మోసం చేసిందని మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఆరోపించారు. బీఆర్ఎస్ రాష్ట్ర పార్టీ రుణంపై రణం పేరుతో ఇచ్చిన పిలుపు మేరకు ఊకల్ క్రాస్‌రోడ్డు వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి ఆంక్షలు లేకుండా అర్హులందరికీ రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తెలంగాణ తల్లి ఫ్లెక్సీకి ఆయన క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో వరంగల్ మార్కెట్ మాజీ చైర్మన్ చింతం సదానందం, మాజీ జడ్పీటీసీ పోలీస్ ధర్మారావు, మాజీ సర్పంచ్‌లు పుంద్రు జయపాల్‌రెడ్డి, బోడకుంట్ల ప్రకాష్, అంకతి నాగేశ్వర్‌రావు, జక్కు మురళి, మార్కెట్ మాజీ డైరెక్టర్ గోలి రాజయ్య, నాయకులు జూలూరి కేదారి, లెనిన్, మోహన్‌రెడ్డి, లడే సంతోష్, సిరెసె శ్రీకాంత్, ధనుంజయ్, మోహన్, పసుల రాజేందర్, నాంపెల్లి సారంగం, జహీర్, రవీందర్‌రెడ్డి, బాలరాజు పాల్గొన్నారు.

● నర్సంపేట : పట్టణంలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద రైతులకు ఎలాంటి ఆంక్షలు లేకుండా రుణమాఫీ చేయాలని బీఆర్ఎస్ వర్కింగ్‌ప్రసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు గురువారం బీఆర్ఎస్ పట్టణ పార్టీ అధ్యక్షుడు నాగెల్లి వెంకట నారాయణగౌడ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు ధర్నా నిర్వహించారు. బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు నాగెల్లి వెంకటనారాయణగౌడ్, మండల పార్టీ అధ్యక్షుడు నామాల సత్యనారాయణ, డాక్టర్ లెక్కల విద్యాసాగర్‌రెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో బీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజ్, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి ఈర్ల నర్సింహరాములు, బీఆర్ఎస్ నాయకులు డాక్టర్ లెక్కల విద్యాసాగర్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, మండల శ్రీనివాస్, రావుల సతీష్, మచ్చిక నర్సయ్యగౌడ్, కౌన్సిలర్ మహబూబ్ పాషా, శివరాత్రి స్వామి, కొల్లూరి లక్ష్మీనారాయణ, మోటూరి రవి, బీరంనాగిరెడి, పెరుమాండ్లరవి, పెరుమాండ్ల ప్రభాకర్ రెడ్డి, మేడిద శ్రీనివాస్, రాయరాకుల సారంగం, తోట సుదర్శన్. కరుణాకర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● ఖానాపురం : అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేయాలని మాజీ ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు మహాలక్ష్మీ వెంకటనర్సయ్య అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు రుణమాఫీ పూర్తిస్థాయిలో అమలు చేయకుండా ఆంక్షలు పెట్టడంపై, తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటుపై సీఎం రేవంత్‌రెడ్డి చేసిన అనుచిత వాఖ్యలను నిరసిస్తూ గురువారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేస్తూ జాతీయ రహదారిపై ధర్నా చేపట్టారు. తొలుత తెలంగాణ తల్లి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ బత్తిని శ్రీనివాస్‌గౌడ్, సొసైటీ డైరెక్టర్లు ఆబోతు అశోక్, సొంటి లక్ష్మణ్, మేకల కుమారస్వామి, బూషబోయిన రాజు, మాజీ సర్పంచ్‌లు కాస ప్రవీణ్‌కుమార్, తక్కళ్లపల్లి బాబురావు, బాషబోయిన ఐలయ్య, బీసీసెల్ మండల అధ్యక్షుడు కోరె సుధాకర్, వల్లెపు శ్రీను. పైండ్ల యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

● చెన్నారావుపేట : రైతుల రుణమాఫీపై ఆంక్షలు ఎత్తి వేయాలని మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఆందోళన చేశారు. నెక్కొండ - నర్సంపేట ప్రధాన రహదారిపై ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ పత్తినాయక్, జిల్లా కో ఆప్షన్ సభ్యుడు ఎండీ రఫీ,మాజీ సర్పంచ్ అనుముల కుమారస్వామి, జయ జెనార్దన్, బోడ మురళి, మూడు రమేష్, సుదర్శన్ దేవ్‌సింగ్, జంగిలి కిరణ్, రాజేందర్, సాగర్, రాజు, పసునూరి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

● దుగ్గొండి : ఎలాంటి షరతులులేకుండా ప్రభుత్వం రు.2లక్షల పంట రుణాలు మాఫీ చేయాలని డిమాండ్‌చేస్తూ నర్సంపేట, వరంగల్ ప్రధాన రహదారి గిర్నిబావి వద్ద బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు వాహనాలు నిలిచి పోయి రవాణా స్థంభించి పోయింది. స్థానిక పోలీసులు జోక్యం చేసుకొని ధర్నాను విరమింప చేశారు. ధర్నాలో మండల పార్టీ అధ్యక్షుడు సుకినె రాజేశ్వర్‌రావు, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ ఆకుల శ్రీనివాస్, కాట్ల భద్రయ్య, శానబోయిన రాజ్‌కుమార్, రాంబాబు, రంగారావు, పొన్నం మొగిలి, శంకేసి కమలాకర్, రజినీకర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, కంచరకుంట్ల శ్రీనివాస్‌రెడ్డి, పిండి కుమారస్వామి, మోడెం విద్యాసాగర్, పల్లె రమేశ్, ఉమేష్‌రెడ్డి, శోభన్‌బాబు, జనార్ధన్‌రెడ్డి, రాజు, రవీందర్‌నాయక్ పాల్గొన్నారు.

● నల్లబెల్లి : రైతులకు రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి ఆంక్షలు లేకుండా రుణమాఫీని ఇవ్వాలని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు బానోతు సారంగపాణి తెలిపారు. మండలంలోని శనిగరం క్రాస్ వద్ద జాతీయ రహదారిపై బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రాస్తారోకో చేశారు. కార్యక్రమంలో నాయకులు కక్కెర్ల శ్రీనివాస్‌గౌడ్, గందె శ్రీనివాస్ గుప్తా, ఇంగ్లి శివాజీ, గండు శ్రీధర్, ఆకుల సాంబారావు, బట్టు సాంబయ్య, బొట్ల పవన్, తక్కెళ్లపల్లి మోహన్‌రావు, మంద రాజిరెడ్డి, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు

వైభవంగా బొడ్రాయి ప్రతిష్ఠ

ఖానాపురం, ఆగస్టు 22: మండలంలోని బండమీది మామిడితండాలో గ్రామ దేవత (బొడ్రాయి), ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలను గురువారం వైభవంగా నిర్వహించారు. అర్చకుడు తాడూరి నాగరాజు చార్యులు, కారంపూడి కృష్ణమూరి మంత్రోచ్చరణలతో నిర్వహించిన విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో భక్తులు పాల్గొని పూజలు నిర్వహించారు. పీసీసీ సభ్యుడు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి, పెండెం రామానంద్, బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు యడ్ల జగన్మోహన్‌రెడ్డి, కాంగ్రెస్ మండలపార్టీ అధ్యక్షుడు, ఏఎంసీ వైస్ చైర్మన్ శాఖమూరి హరిబాబు, వీరమనేని సాగర్‌రావు, భానుప్రసాద్ తదితరులు పూజలు నిర్వహించారు.

కరువు భత్యం విడుదల చేయాలి

వర్ధన్నపేట, ఆగస్టు 22: ఉపాధ్యాయులకు ఐదు విడుతల కరువుభత్యం వెంటనే విడుదలచేయాలని పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మహ్మద్ అబ్దుల్ గఫార్ డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో మండల శాఖ ఆధ్వర్యంలో ప్రాథమిక సభ్యత్వ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో పీఆర్ టీయూ నాయకులు నిమ్మ మనుజేందర్‌రెడ్డి, సమ్మిరెడ్డి, వెంగళ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

నేడు పెన్షన్ విద్రోహ దినం

చెన్నారావుపేట, ఆగస్టు 22: రాష్ట్ర వ్యాప్తంగా తెలంగాణ ఉపాధ్యాయ, ఉద్యోగులు శుక్రవారం పెన్షన్ విద్రోహ దినంగా పాటించాలని టీఎస్‌సీపీఎస్‌ఈయూ రాష్ట్ర అసోషియేట్ అధ్యక్షుడు సోనబోయిన రవిచందర్ పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ తెలంగాణలో పాత పెన్షన్ అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులందరూ పాల్గొని విజయవంతంచేయాలని కోరారు.కార్యక్రమంలో జిల్లా బాధ్యులు నీలం భాస్కర్, మండల అధ్యక్షు డు బానోతు వెంకన్న, ప్రధాన కార్యదర్శి అజ్మీర స్వామి పాల్గొన్నారు.

టీఏఎస్ జిల్లా కోకన్వీనర్‌గా యాలాద్రి



పర్వతగిరి, ఆగస్టు 22: తెలంగాణ అంబేడ్కర్ సంఘం (టీఏఎస్) వరంగల్ జిల్లా కో-కన్వీనర్‌గా మండలంలోని చింతనెక్కొండకు చెందిన దబ్బెట యాలాద్రిని నియమిస్తూ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జన్ను నర్సయ్య గురువారం నియామక ఉత్తర్వులను జారీ చేశారు. ఈ సందర్భంగా యాలాద్రి మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన జన్ను నర్సయ్యతో పాటు జిల్లా అధ్యక్షుడు కంజర్ల మహేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

యువకుడికి గాయాలు

వర్ధన్నపేట, ఆగస్టు 22 : పట్టణ శివారు సంగెం వాగు బ్రిడ్జి వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్రగాయాలైనట్లు స్థానిక పోలీసులు తెలిపారు. రాయపర్తి మండలం మొరిపిరాల గ్రామానికి చెందిన ఇషాక్ (బన్ని) అనే యువకుడు ద్విచక్ర వాహనంపై వెళ్తూ ఎదురుగా వస్తున్న గేదెను ఢీ కొట్టాడు. దీంతో ఇషాక్ తీవ్ర గాయాలపాలయ్యాడు.

నేడు ఉచిత వైద్య శిబిరం

చెన్నారావుపేట, ఆగస్టు 22 : మండలంలోని కోనాపురంలో నేడు (శుక్రవారం) ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు డాక్టర్ సరోజ తెలిపారు. నర్సంపేట మెడికల్ కళాశాల వారి ఆధ్వర్యంలో నిర్వహించనున్న వైద్య శిబిరానికి పలు రకాల వైద్యులు రానున్నట్లు తెలిపారు. ప్రజలు ఈ శిబిరాన్ని వినియోగించుకోవాలన్నారు.

ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి

ఖానాపురం, ఆగస్టు 22 : విద్యార్థులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని టెలిమానస్ శిక్షకుడు, సైక్రియాటిస్ట్ డాక్టర్ భరత్ అన్నారు. టెలిమానస్ శిక్షణలో భాగంగా గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు శిక్షణ నిచ్చారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చిన్నచిన్న విషయాలకే అధైర్యపడకుండా ధైర్యంగా ఎదుర్కోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సదానందం పాల్గొన్నారు.

వరంగల్ మార్కెట్ ధరలు

పంట	క్వింటా గరిష్ఠ	క్వింటా కనిష్ఠ
మక్కలు	2,821	2,602
పల్లికాయ(పచ్చిది)	4,250	3,500
పల్లికాయ(సూక)	5,850	5,000
పత్తి	7,420	5,000
పసుపు(కాడి)	13,516	9,090
పసుపు(గోల)	13,116	12,044
తేజ మిర్చి	12,000	8,000
తేజ ఏసీ	18,500	9,000
వండర్‌హాట్ ఏసీ	15,000	12,000
యూఎస్341 ఏసీ	15,500	9,000
తాలు మిర్చి	6,000	3,000

నాటిన మొక్కలను రక్షించాలి

పర్వతగిరి, ఆగస్టు 22 : మొక్కలు నాటి సంరక్షించాలని ఎంపీడీవో శంకర్‌నాయక్ అన్నారు. నాటుదాం ఒక చెట్టు-అమ్మ పేరు మీద (ఏక్ పేడ్ మా కే నామ్)పేరిట గురువారం నిర్వహించిన కార్యక్రమంలోభాగంగా మండల కేంద్రంతో పాటు వడ్లకొండలో మొక్కలనునాటారు. ఆయన మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించాలని, ప్లాస్టిక్ వస్తువులను వాడకూడదన్నారు. కార్యక్రమంలో ఏపీవో సుశీల్‌కుమార్, ఈసీ రాజు, కార్యదర్శులు సునీల్, రఘు,టీఏ గణేష్, ఫీల్డ్‌అసిస్టెంట్లు, అంగన్‌వాడీ, మహిళాసంఘం సభ్యులు పాల్గొన్నారు.

● దుగ్గొండి: నాటిన ప్రతీమొక్కను రక్షించేవిధంగా చర్యలు తీసుకోవాలని డీఎల్‌పీవో రాజీవ్‌కుమార్ పిలుపునిచ్చారు. మండలంలోని గిర్నిబావిలో ఫార్మేషన్ రోడ్డు ఇరుపక్కలా మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీవో శ్రీధర్‌గౌడ్, కార్యదర్శి వేణుప్రసాద్, ఎఫ్ఏ, జీపీ సిబ్బంది పాల్గొన్నారు.

● చెన్నారావుపేట: మండల కేంద్రంలోని ఉపాధిహామీ కార్యాలయం ఆవరణలో ఫ్రేమ్ హెల్పింగ్ ట్రస్టు ఆధ్వర్యంలో ఎంపీడీవో శ్రీవాణి, తహసీల్దార్ ఫణికుమార్ మొక్కలు నాటారు. నాటిన మొక్కలను కాపాడుకోవాలని కోరారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ అయేషా పర్వీన్, సీనియర్ అసిస్టెంట్ సమ్మయ్య, టైపిస్టు రజిత, టెక్నికల్ అసిస్టెంట్ సింగ్, ఫీల్డ్‌అసిస్టెంట్ మోహన్, శ్రీదేవి, కల్యాణి పాల్గొన్నారు.

● రాయపర్తి: అమ్మపేరు మీద ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటాలని డీఎల్‌పీవో వేదవతి సూచించారు. మండల కేంద్రంతోపాటు మండలంలోని మైలారం, ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీవో ప్రకాష్, కార్యదర్శి వినోద్,విజయేందర్, వీరేందర్ పాల్గొన్నారు.

● వర్ధన్నపేట రూరల్ : అమ్మ పేరుపై ప్రతి ఒక్కరం ఒక మొక్కనునాటి మన బాధ్యతను నిర్వర్తించాలని మండల ఎంపీవో అంకం ధనలక్ష్మి అన్నారు. మండలంలోని దమ్మన్నపేటలోని అంగన్‌వాడీ కేంద్రంలో మొక్కలునాటారు. మండలంలోని కడారిగూడెంలో సైతం కార్యదర్శి సెక్రటరీ రాజు ఆధ్వర్యంలో మదర్ ప్లాంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రాజు, సంధ్య, రాంభూపాల్ పాల్గొన్నారు.

ఘనంగా సీనియర్ సిటిజన్స్ డే

చెన్నారావుపేట, ఆగస్టు 22 : మండల కేంద్రంలోని సిద్దార్థ గురుకుల హై స్కూల్‌లో సీనియర్ సిటిజన్ వారి ఆధ్వర్యంలో జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని సీనియర్ సిటిజన్ అంద్ర లచ్చమ్మ అనే 92 సంవత్సరాల వృద్ధురాలిని శాల్వాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు ఈగ సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి ములుక సాంబయ్య, వరంగంటి కుమారస్వామి, నర్సింహ, తాళ్లపెల్లి కొమ్మాలు, వరంగంటి మల్లయ్య, కంది నారాయణరెడ్డి, ముత్యం సాంబయ్య, కేతిడి సమ్మిరెడ్డి, హంస నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

నర్సంపేట పోలీస్‌స్టేషన్‌కు ఇద్దరు ఎస్సైలకు పోస్టింగ్

'ఆంధ్రజ్యోతి' ఎఫెక్ట్

నర్సంపేట టౌన్, ఆగస్టు 22 : ఎస్సైలు లేక ఆరు నెలలు.. నర్సంపేట పోలీస్ స్టేషన్‌కు ఎస్‌హెచ్‌వోనే దిక్కు.. అనే శీర్షికన ఆంధ్రజ్యోతి దినపత్రికలో గురువారం ప్రచురితమైన కథనానికి వరంగల్ సీపీ అంబర్ కిషోర్‌ఝా స్పందించారు. నర్సంపేట పోలీస్‌స్టేషన్‌కు ఇద్దరు ఎస్సైలకు పోస్టింగ్‌ను ఇస్తూ గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. సీపీ స్పందించి త్వరితగతిన ఎస్సైలకు పోస్టింగ్‌ఇస్తూ ఉత్తర్వులు జారీ చేయడంతో నర్సంపేట ప్రజలతో పాటు పనిభారంతో ఒత్తిడికి లోనవుతున్న పోలీస్‌సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తున్నారు. వరంగల్ కమిషనరేట్ పరిధిలో వీఆర్‌లో ఉన్న జి.రాజేష్‌రెడ్డి, పి.తిరుపతిలను నర్సంపేట పోలీస్‌స్టేషన్‌కు పోస్టింగ్‌లు ఇచ్చారు.

గుప్త నిధుల కోసం తవ్వకాలు జరిపిన వ్యక్తులపై కేసు

చెన్నారావుపేట, ఆగస్టు 22 : మండలంలోని పాపయ్యపేటలో గుప్త నిధులు తవ్విన వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై గూడ అరుణ్‌కుమార్ గురువారం తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం... ఇదే గ్రామానికి చెందిన చీనూరి యాకయ్య ఇంట్లో గుప్తనిధుల కోసం తవ్వకాలు చేయగా, ఇంటి పరిసరా ప్రాంతాలను పరిశీలించిన పోలీసులు ఇంట్లో తవ్వకాలు జరిగినట్లు గుర్తించి, ములుగు జిల్లా వాజేడు మండలానికి చెందిన రాచకొండ నర్సింహాస్వామి, చీనూరి యాకయ్య, మామిడాల రమేష్‌లపై కేసులు నమోదు చేశారు. మరి కొంత మందిపై విచారణ జరుపుతున్నట్లు ఎస్సై వివరించారు.

కమిషనరేట్‌లో ఏడుగురు ఎస్ఐల బదిలీ

వరంగల్ క్రైం, ఆగస్టు 22: వరంగల్ కమిషనరేట్ పరిధిలో ఏడుగురు ఎస్ఐలను బదిలీ చేస్తూ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. జి.రాజేష్ రెడ్డి వీఆర్ నుంచి నర్సంపేటకు, జె.పరమేశ్వర్ వీఆర్ నుంచి ఆత్మకూరుకు, కె.అశోక్‌కుమార్ వీఆర్ నుంచి హనుమకొండకు, పి.తిరుపతి వీఆర్ నుంచి నర్సంపేటకు, డి.నిహారిక సీఎస్‌బీ నుంచి వీసీఆర్‌కు, ఎం.రాజు సీసీఎస్ నుంచి కేయూసీకి, ఎస్.రవి సీసీఎస్ నుంచి హసన్‌పర్తి పోలీసుస్టేషన్‌కు బదిలీ అయ్యారు.

అంతర్జాతీయ కబడ్డీ పోటీలకు ధర్మారం విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం

గీసుగొండ, ఆగస్టు 22 : రూరల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి కబడ్డీ పోటీల్లో ధర్మారం జడ్పీ పాఠశాలలో చదువుతున్న ఓర్సు హరీష్, శివరాత్రి కిశోర్ అత్యంత ప్రతిభ కనబరిచి అంతర్జాతీయ పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం సాంబయ్య తెలిపారు. గోవాలో నిర్వహించిన జాతీయస్థాయి పోటీల్లో హరీష్ తెలంగాణ రాష్ట్ర జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించారు. ఈ నెల 27నుంచి నేపాల్‌లో జరిగే అంతర్జాతీయ పోటీల్లో హరీష్, కిశోర్ పాల్గొంటారని చెప్పారు. కాగా, హరీష్, కిశోర్‌లను హెచ్ఎం, ఉపాధ్యాయులు, యాప్ కమిటీ సభ్యులు గురువారం అభినందించారు.

అస్తవ్యస్తం!

(5వ పేజీ తరువాయి)

లక్ష్యంగా శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులతో ఆన్‌లైన్ క్లాసులు ప్రతీ మంగళవారం, శుక్రవారం జరుగుతున్నాయి. మండల కేంద్రాలలోని రైతు వేదికలు మినహా మిగితా రైతు వేదికల్లో ఏఈవోల ఆధ్వర్యంలో రైతు రుణమాఫీ తదితర వ్యవసాయసాగు సంబంధించిన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఏఈవోలే వాటి నిర్వహణ భారాన్ని మీద వేసుకుని నడిపిస్తున్నారు.

ప్రభుత్వానికి నివేదిస్తున్నాం..

డీఏవో ఉషాదయాల్

రైతు వేదికల నిర్వహణకు సంబంధించిన నిధుల విషయమై ప్రతీ నెల ప్రభుత్వానికి నివేదికలు పంపిస్తున్నాం. త్వరలోనే ప్రభుత్వం నిధులు విడుదల చేసే అవకాశం ఉంది. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం.